సంపుటి 39 సంచిక 118 జూన్ 2019

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



## విషయ సూచిక


సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి........................................................................................ 2

సెక్రెటరీ రిపోర్ట్ – రమేష్ మున్నె.................................................................................................. 3


## శీర్షికలు


షోడశోపచారాలు .......................................................................................................6

వంటొచ్చిన పెళ్ళాం- డి. కామేశ్వరి................................................................................... 13

తెలుగు అక్షర రహస్యాలు తెలుసుకుందాం- ఉమామహేశ్ శనగవరపు...................................................19

పాట నేర్చుకుందామా/పాడుకుందామా................................................................................ 32

దర్శకరత్నతో నా అనుబంధం-వంశీ రామరాజు....................................................................... 25

ప్రేమలెన్నో- తెన్నేటి సుధ............................................................................................... 29

సంగీతనాదామృతం - డా. పద్మ మల్లెల.............................................................................. 31

జలపాల కథ- చిట్టెన్ రాజు వంగూరి.....................................................................................34

ఇల్లే కదా నరకం స్వర్గం – శ్రీ పెయ్యేటి రంగారావు........................................................................ 37

పండిన అరటికాయ పచ్చడి – శ్రీదేవి పెయ్యేటి............................................................................ 44

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | వెబ్ అడ్మిన్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మినారాయణ గొల్లపూడి | అపర్ణ సుసర్ల |


# సంపాదకీయం

తెలుగువారి ఆత్మీయ మాసపత్రిక వాహిని జూన్ నెల లో కథలు, విశేషాలతో మీ ముందుకు వచ్చేసింది. గడచిన మే నెలలో సిడ్నీ తెలుగు అసోసియేషన్ ద్వారా శ్రీ అవధానులుగారి వేద ఉపన్యాసాలకు అధిక సంఖ్యలో మనతెలుగు వారు హాజరైనారు.అలాగే జూన్ నెలలో వనితామండలి వారు నిర్వహించిన క్యాన్సర్ కౌన్సిల్ ఫండ్ రైస్ ఈవెంట్ అద్భుతంగా నిర్వహించారు. వివరాలు జులై నెల వాహినిలో అందచేయగలము. ఇక జూన్ 16వ తేదీన వాహిని మాసపత్రిక ద్వారా మొదటి సాహితి సదస్సు నిర్వహించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వివరాలకై వాహిని పేజీలు తిరగేయండి. చలికాలమైనా సిడ్నీ వాసులు ఆనందంగా సమయం గడపడానికి వివిడ్ దీపాలతో మన నగరం శోభాయమానంగా అలంకారంతో వెలుగులు విరజిమ్ముతోంది. ఆ చిత్రాన్నే వాహిని ముఖచిత్రంగా ప్రచురించాము. మనిషి ఆశాజీవి. ప్రతిదశలోను ఎన్నో విలువైన విషయాలు తెలుసుకుంటూ సాగించే పయనంలో వ్యక్తుల పరిచయాలు, అనుభవాలు ఎదురవుతాయి. మంచి, చెడు, చేదు, తీపి కలగలిపిన జీవిత అనుభవాలే మంచి పాఠాలు నేర్పిస్తాయి. గడిచిన క్షణం మరల రాదు. రేపు ఏమౌవుతుందో తెలియదు, అది మూసిఉంచిన భగవంతుని గుప్పిట. ప్రస్తుతం ఎదుట ఉన్న క్షణం అతి విలువైనది. మన భారతీయులకున్న సంపద సనాతన ధర్మం. సాంకేతికంగా మనకున్న మాధ్యమాలలో మంచిని పెంపోందించే ఎన్నో విషయాలు పొందుపరుస్తున్నారు. సాధ్యమైనంతవరకు మన తెలుగువారికి సంబంధించి విలువైన విషయ సమాచారం, కథలు, సాహిత్యంతో మీకోసం అందించాలనే ఒక ఆశయం. విషయసేకరణ, స్ఫూర్తినిచ్చే వ్యక్తులు, అంశాలు, పర్యాటక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాలు ఇలా ఒకటేమిటి ఉపయోగకరమైన అంశాలు మీరు వాహిని మాసపత్రికలో ప్రచురణకై పంపమని కోరుతున్నాము. ప్రస్తుతానికి కథా సాహిత్యంతో వాహిని మాసపత్రిక సిద్ధంగా ఉంది. పూర్తిగా చదవండి, చదివించండి. తెలుగు భాషతో అనుబంధం పెంచుకోండి. అందరం వాహిని సాహితి సదస్సులో కలుసుకుందాం. సదా మీ శ్రేయస్సును అభిలషించే

మీ శ్రేయోభిలాషి,

విజయ గొల్లపూడి 0438293687

vahini@sydneytelugu.org


## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: సతీష్ వరదరాజుe
0408 469 758


వైస్ ప్రెసిడెంట్: శ్రీ మధు బైరెడ్డి
0425 209 397


సెక్రెటరీ: రమేష్ మన్నె
0401 507 409


ట్రేసరర్:మూర్తి ఓలేటి
0402 137 475


కమిటీ మెంబర్: నరసింహరావు పెద్దాడ
0456 226 000


కమిటీ మెంబర్: మోహన్ కుమార్ పరస్సు 0419 219 526


కమిటీ మెంబర్: హరిబాబు కొల్లూరి
0425 291 032

## సబ్ కమిటీలు


వాణి కన్వీనర్ : సారధి మోటమర్రి
0430 002 130


వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు స్కూల్ కోఆర్డినేటర్
మల్లిక్ రాచకొండ 0431 680 092


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0400 031 546


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## UIA మెంబర్


శ్రీని పిల్లమట్టి
0452 025 666

## ఫైనాన్సియల్ అడ్వైసరి కమిటీ (FAC)


మూర్తి పోతుకూచి


శ్రీనాథ్ ఖండవల్లి


సుందరం రాచకొండ


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear respected STA members,

Welcome to the May edition of the Secretary's Report.

Greetings, the month of May is very busy for our Telugu Community in Sydney with lot of gatherings, Prayers, Poojas, celebrations and etc. For our STA EC team, after a huge successful event in April, it may seem to be a relaxing month but the team is working hard in negotiating with our regular annual sponsors to continue with us and looking for new annual sponsors as well as reconciling accounts for annual auditing. Our 26th year celebrations are captured in memorable quality pictures and videos; these will be uploaded into our web site and shared via our STA mediums. If anyone wants a copy photos or videos, please download them or contact any EC team member for any particular copy.

STA's sub-committee, Telugu Seniors led by Sri Pothukuchi Murthy garu, have organised Vedic talks by Dr Avadhanlu garu at Strathfield. There are many members not only seniors, all age groups attended this event. On behalf of EC, I congratulate that STA Team for another successful event.

**Upcoming Events:**

**Vahini Sahithi Sadassu**

**16/06/19**

**Toongabbie Scout Hall**

**Welcome to New Life Members May 2019**

| TITLE | FIRST_NAME | *LAST_NAME* |
|---|---|---|
| Mr | Narendra | Annabattula |

Best Regards,

Ramesh Manne

Secretary, Sydney Telugu Association Inc.

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

# వాహిని తెలుగు సాహితీ సదస్సు



సిడ్నీ తెలుగు అసోసియేషన్ ద్వారా ప్రతి నెల వెలువడుతున్న మాసపత్రిక "తెలుగు వాహిని" నిర్వహిస్తున్న తొలి సాహితీ సదస్సు ఈ నెల జూన్ 16 వ తేదీన నిర్వహించుచున్నాము. ఈ సదస్సుకై ఔత్సాహికులైన తెలుగుభాషా ప్రేమికులు సిద్ధం అవుతున్నారు. ఈ వాహిని తెలుగు సాహితి సదస్సు నిర్వహించటంలో గల ముఖ్య ఉద్దేశ్యం తెలుగు వారి మాధ్యమం వాహిని మాసపత్రిక గురించి మన తెలుగును అభిమానించే ప్రతిఒక్కరికి అందచేయడం, తెలుగు భాషాభివృధి, ఔత్సాహిక రచయితలకు ఆహ్వానం, తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన మహానుభావులను గుర్తు చేసుకోవటం, తెలుగు రచనలు, మన తియ్యని తెలుగులో వక్తల ప్రసంగాలు ఒక సాహిత్య గోష్ఠి. చక్కనైన చిక్కనైన తెలుగులో సంభాషించుకుంటూ భాషకోసం ఒక రోజు కేటాయించి చేసే ప్రయత్నం.

తెలుగులో రచనలు పంపాలన్నా, తెలుగు అక్షరాలు టైప్ చేయడం నేర్చుకోవాలనుకునేవారు, వాహిని మాసపత్రిక పాఠకులు, ప్రోత్సహిస్తున్న శ్రేయోభిలాషులను ఆహ్వానించుచున్నాము. ఈ సాహితీ సదస్సుకై మీ పేరు, వివరాలు నమోదు చేసుకుని హాజరు కాగలరని కోరుతున్నాము.

స్థలం: Toongabbie Scout Hall, 99 Bungaree Road, Toongabbie.

సమయం: 10.30 am – 2.30 pm.

Contact: Vijaya Gollapudi on 0438 293 687 or Vahini@sydneytelugu.org



## షోడశోపచారాలు



మనం భగవంతుని షోడశోపచారాలతో పూజిస్తాము. ఉపచారము అనగా సేవ అనే అర్థం. అనగా మనం దేవునికి నిత్యం జరిపే పూజలు

పదహారు రకాల ఉపచారాలు/సేవలు షోడశోపచారాలు

1. ఆవాహనం,2. ధ్యానం, 3. ఆసనం, 4. పాద్యం, 5. అర్ఘ్యం,6. స్నానం – అభిషేకం

7. వస్త్రం, 8. యజ్ఞోపవీతం, 9. గంధం,10. అధాంగ పూజ,11. ధూపం,12. దీపం

13. నైవేద్యం, 14. తాంబూలం, 15. నీరాజనం, 16. మంత్ర పుష్పం

1. ఆవాహనం:

భగవంతుడిని పూజామండపానికి ఆహ్వానించడము

2. ధ్యానం:

భగవంతుడిపై పూర్తిగా మనసు లగ్నం చేసి పూజామండపం లోకి ఆహ్వానించి పూజించడానికి శ్లోకంతో చేసే సేవను ధ్యానం అంటారు. భగవంతుడిని రాముడు, కృష్ణుడు, లక్ష్మి లేదా గౌరీ అంటూ ఏ రూపంలోనైనా పూజించవచ్చు. అది పూజ చేసే సందర్భాన్ని బట్టి, మనకున్న నమ్మకాన్ని బట్టి ఉంటుంది. ఏ పేరుతో పిలిచినా, ఏ రూపంలో కొలిచినా భగవంతుడు ఎప్పుడూ భక్తుల పక్షమే. శ్రద్ధాసక్తులు ముఖ్యమైనవి.

3. ఆసనం:

రత్నాలంకృతమైన బంగారు సింహాసనాన్ని అధిష్టించి పూజలందుకొమ్మని ఆసనం సమర్పించడం.

4. పాద్యం:

పాదాలు (కాళ్ళు) శుభ్రపరుచుకోవడానికి నీరందించడాన్ని పాద్యం అంటారు.

5. అర్ఘ్యం:

చేతులు శుభ్రపరుచుకోవడానికి నీరు అందించడాన్ని అర్ఘ్యం అంటారు.

6. అభిషేకం:

స్నానికి జలం సమర్పించడాన్ని అభిషేకం అంటారు. దేవునికి పంచామృతం (తేనె, ఆవు పాలు, ఆవు నెయ్యి, పెరుగు, పంచదార) స్నానం అత్యంత ప్రీతికరమైనది. ఈ ఏడు పదార్థాలతో స్నానం చేయించి తర్వాత మళ్ళీ శుద్ధమైన జలంతో స్నానం చేయించడాన్ని అభిషేకం అంటారు.

7. వస్త్రం:

అభిషేకం పూర్తి అయ్యాక దేవునికి సమర్పించే వస్త్రాలను వస్త్రం సమర్పయామి అని అందిస్తారు.

8. యజ్ఞోపవీతం:

భుజం పై నుంచి వేసుకోవడానికి యజ్ఞోపవీతం సమర్పించడం.

9. గంధం:

దేవునికి గంధం, అక్షతలు మరియు పుష్పాలు సమర్పించడం.

10. అధాంగ పూజ"

దేవునికి వారి అన్ని శరీర అవయవాలను కీర్తిస్తూ పూజ సమర్పించడాన్ని అధాంగ పూజ అంటారు.

11. ధూపం:

దేవునికి అగరవత్తులు మరియు ధూపం సమర్పించడం

12. దీపం:

దీపాన్ని వెలిగించి దేవుని ముందుంచి ధ్యాన నిమగ్నులమై పూజించడం.

13. నైవేద్యం:

భక్తి ప్రపత్తులతో, శ్రద్ధాసక్తులతో భగవంతునికి ఆరగించడానికి సమర్పించే భక్ష్య భోజ్యాలను నైవేద్యం అంటారు. ఆ భగవానుడే మనకి ఇచ్చిన జీవితానికి, ఆనందాలకు, సుఖశాంతులకు, మనం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుకోవడానికి ఇదొక అవకాశం.

14. తాంబూలం:

మనం భక్తి తో సమర్పించిన భక్ష్య భోజ్యాలతో సంతుష్టుడైన దేవునికి, తాంబూలం సమర్పించడం. తాంబూలం జీర్ణశక్తిని పెంచుతుంది.

15. నీరాజనం:

దేవునికి కర్పూరంతో హారతి వెలిగించి, దిష్టి తీసి, మంగళం పాడి, మనం కళ్ళకి అద్దుకోవడం.

16. మంత్రపుష్పం:

మన మనస్సునే ఒక పుష్పంగా చేసి భగవంతునికి సమర్పించడానికి మంత్ర సహితంగా చేసే సేవనే మంత్రపుష్పం అంటారు. ఇన్ని సేవలూ పూర్తి అయ్యాక, చేసిన పూజలో గాని, చదివిన మంత్రాలలో గాని తప్పులున్న మన్నించమని, ఉచ్చారణ దోషాలున్నా, భక్తి లో ఎటువంటి లోపము ఉండదని అపరాధ క్షమాపణ చెప్పుకుని దేవుని సాగనంపుతారు.

వెళ్లేముందు "పునరాగమనాయచ" అంటూ మళ్ళీ రమ్మని చెప్పి మరీ పంపుతారు. ఇవి మనం నిత్యం దేవునికి సమర్పించే షోడశోపచారాలు (సేవలు).

# భారతదేశానికి మామిడి గర్వకారణమైన పండు




మామిడి పండు: దీనిని పండ్ల రారాజు అని పిలుస్తారు. హైబ్రిడ్ మామిడి కంటే నాటు మామిడిలో పీచుపదార్థం ఎక్కువ. బాగా పండిన మామిడి మన శరీరంలో రక్తం పెరుగుదలకు సహాయపడుతుంది. శరీరంలో పేరుకు పోయిన విషపదార్థాలను మూత్రం ద్వారా బయటకు పంపించటంలో సహాయపడుతుంది. తగిన మోతాదులో ఎ,బి,సివిటమిన్లుఉంటాయి. మామిడి రొమ్ము, పెద్దపేగు క్యాన్సర్ కణాల పెరుగుదలను అరికడుతుంది.

❖❖❖❖❖






❖❖❖❖❖

సిడ్నీ మహానగరానికి విచ్చేసిన డా.రేమెళ్ళ అవధానులుగారికి ఘనస్వాగతం, అపూర్వ గౌరవ సత్కారాలు



**వేదాలను కంప్యుటరైజ్ చేసిన భారతీయ మేధావి డా. శ్రీ రేమెళ్ళ అవధానులు గారు.**

**వారు శ్రీ పోతుకూచి మూర్తిగారి హయాంలో సిడ్నీ తెలుగు అసోసియేషన్ ద్వారా నిర్వహించిన ఐదు రోజులు వేదాల గురించి ఇచ్చిన ఉపన్యాసాలు విజయవంతంగా ముగిసాయి. ఇంతేకాకుండా వారు సిడ్నీ లో, ఆస్ట్రేలియా లోని పలు ప్రదేశాలు వెళ్ళి, వేదాలకు సంబంధించి వివిధ అంశాలపై అనర్గళంగా ప్రసంగించారు.**

**Sydney University, Indian Consulate, Hindu Council Canberra, University of Technology Sydney, Viswa Hindu Parishad, Bhuvana vijayam Melbourne, Sri Veda Gayathri Parishad Sydney Etc. The various topics on Vedas, lectures from Sri Avadhanulu garu**

**Vedic maths for students, Nuclear Physics and Mathematics in Vedas, Light on Vedas-Source of Universal Knowledge & Wisdom, Scientific aspects in Vedas & Sastras Etc.**

**వారు ఆంగ్లంలో ప్రసంగించడంతో ఆస్ట్రేలియా లోని భారతీయ సంతతి, చిన్నారులు, విద్యార్థులు ఎంతో లబ్ధి పొందారు. భారతీయ సనాతన ధర్మం, వేదాలు సైన్స్ వీటిపై చక్కని అవగాహన కలిగించారు. వారు రాసిన పుస్తకాలు, సిడిలు మన వేదాలలోని సారాన్ని తెలుసుకోవడనికి అత్యంత ఉపయోగకరమైన సాధనాలు. వారు చూపు లేని వారికి బ్రెయిలీ లిపి లో ఆంగ్లంలోను, తెలుగు భాషలలో కూడా పుస్తకాలు వెలువరించారు. వారి ఈ విశేష కృషి దాదాపు పదివేల మంది చూపు లేనివారిపాలిట వరప్రసాదమైనది. వారి ప్రసంగాలలో వేదాలలోని ఎన్నో ఉపయుక్తమైన విషయాలు, వారి జీవిత అనుభవాలు జోడిస్తూ ఉదహరించారు.**


తెలుగు అసోసియేషన్
సిడ్నీ
PUBLIC SCHOOL
THINK OF OTHERS
STRATHFIELD
SOUTH
PUBLIC SCHOOL


తెలుగు అసోసియేషన్
సిడ్నీ

❖❖❖❖❖

## శీతాకాలంలో వివిడ్ కాంతుల వెలుగులో సిడ్నీ నగరం, ఒపెరా అందాలు





https://www.vividsydney.com/

❖❖❖❖❖

08:00 - 10:00 AM Sydney Time on Sat
02:30 - 04:30 AM India time
16:00 - 18:00 Hrs New York Time (Day -1 or Fri)
[ For India/US +1 Hour during Australia Winter Time]

Listen to Radio on 2TripleO FM 98.5 or DAB 985 or

You can also listen on PC/ internet, the URL is:
https://2tripleo.com.au/en-au/
http://s7.viastreaming.net/8500/m/

The program can also be listened over phone-audio by dialling: **+61 2 8080 5650**

via **TuneIn** App on **Android | iPhone**

**తెలుగువాణి – ఆస్ట్రేలియా స్వరవాహిని**
**2TripleO FM98.5 MHz**
**DAB 985**
**Saturdays 08:00 – 10:00AM Sydney Time**

27 సంవత్సరాలుగా సిడ్నీ తెలుగువారిని ప్రతి శనివారం ఉదయం 08:00 – 10:00 గంటల వరకు, మంచి మంచి అంశాలతో అలరిస్తూ, 25 ప్రసారకుల స్వచ్ఛంధ సేవలతో రేడియో కార్యక్రమాలను అందిస్తున్న తెలుగువాణి కార్యక్రమాలను
2TripleO FM 98.5 అలవరసాలపై
**వినండి. వినిపించండి. వింటూ ఉండండి.**
ప్రసారకులుగా కార్యక్రమాలు అందించాలనే ఆసక్తి ఉన్నవారు;
కారక్రమాలకు ఆర్థికంగా ప్రోత్సాహం అందించ తలచుకున్నవారు;
వ్యాపార ప్రకటనలను ఇవ్వదలచుకొన్నవారు;
మా కార్యక్రమాలపై అభిప్రాయాలను తెలియచేయాలనుకొనేవారు – సంప్రదించండి:

శ్రీ సారధి మోటమఱ్ఱి, 0430 022 130 or vani@sydneytelugu.org

**https://www.facebook.com/TeluguVaniSydney**

❖❖❖❖❖




❖❖❖❖❖

# వంటొచ్చిన పెళ్లాం

డి. కామేశ్వరి

"ఏమిటీ?" అరిచినట్టుగా ఒక్కసారే అన్నారు తల్లి, తండ్రి, మామ్మ.

"అవును. నాకు ఇంజనీరింగులు, ఎంబిఏలు, ఉద్యోగాలు చేసే అమ్మాయిల వద్దు. హాయిగా ఇంటిపట్టున ఉండి వండిపెడుతూ, ఇల్లు, సంసారం, పిల్లల చూసుకునే అమ్మాయి చాలు" అమెరికాలో ఎమ్మెస్ చదివి మంచి ఉద్యోగం చే పండుబాబు ఉరఫ్ చైతన్య తెగేసి తన నిర్ణయం చెప్పేశాడు. పెళ్లి చేసుకోమ అడిగిన తల్లిదండ్రులు, ఇలాంటి కోరిక కోరిన కొడుకుని చూసి తెల్లబోయారు

"అవును, నాకు వంటొచ్చిన పెళ్లాం కావాలి. ఏదో మామూలు డి చదువుకుని, కాస్త స్మార్ట్‌గా ఉంటే చాలు" అర్థమయ్యేట్టు మళ్లీ చెప్పాడు.

"వంటొచ్చిన పెళ్లాం అంటే వంటల్లో డిగ్రీలు ఉండాలా?" అర్థం కానట అడిగింది తల్లి.

"పో అమ్మా! అది కాదు, చక్కగా రుచిగా మన సంప్రదాయ వంటలు చే అమ్మాయిని చూడండి. ఉద్యోగాలు చేసే అమ్మాయిలు నాకొద్దు. నాకు తిం సుఖం, ఇంటి సుఖం కావాలి. వద్దని మొత్తుకున్నా వినకుండా యు.ఎస్. పంపా నన్ను. నాలుగేళ్లనించీ తిండి లేకుండా మలమలా మాడిపోతున్నాను. ఇప్పటికన హాయిగా కావల్సినవి తినాలి నేను."

"ఓర్నీ! నీ తిండిగోల ఏమిట్రా బాబూ! ఎవరన్నా అందం, చదువు, ఉద్యోగం కావాలంటారు."

"ఆ చూశాలే, ఉద్యోగం చేసే అమ్మాయిల సంగతి! మా ఫ్రెండ్స్ నానాగడ్డీ కరుస్తున్నారు. కూరలు వీళ్లే తరగాలి. కుక్కర్లు వీళ్లే పెట్టాలి. గిన్నెలు వీళ్లే తోమాలి. తరిగిన కూర పోపులో వేసో, వేయించో, ఇంత పప్పు కుక్కర్లో వండి, ఇండియా నుంచి తెచ్చిన పచ్చడి ప్లేట్లలో వేసేసరికి చాకిరీ అంతా వాళ్లే చేస్తున్నట్టు పోజులు, చికాకులు, కసుర్లు, విసుర్లు. సరిసమాన జీతం, సరిసమానంగా పని పంచుకోవాలని నినాదాలు, ఇంటికి ఎవరు ముందుగా వస్తే వాళ్లే వండాలని షరతులు, ఓ వారం నీవు, ఓ వారం నేను అంటూ సర్దుబాట్లు. పిల్లలుంటే సరేసరి! నేపీలు మార్చాలి, ఫీడింగ్ బాటిల్స్ స్టెరిలైజ్ చెయ్యాలి. రాత్రిళ్లు ఏడిస్తే వాళ్లతోపాటు వీళ్లూ మేలుకుని కూర్చోవాలి. ఓరి నాయనో! వాళ్ల సంసారం పాట్లూ, ఆడవాళ్ల డిమాండ్లూ చూశాక చచ్చినా ఉద్యోగం చేసే అమ్మాయి వద్దనుకున్నా!"

"బానే ఉంది, మరి నీ ఒక్కడి జీతంతో మేనేజ్ చేయగలవా?" తండ్రి ఆరా.

"చేయాలి, ఇదివరకు ఆడవాళ్లు ఉద్యోగాలు చేశారా? ఎంత ఉంటే అంత సరిపెట్టుకోవాలి" కొడుకు సమాధానం.

"ఉద్యోగం చెయ్యొద్దు, వంట చేసుకుంటూ పడి ఉండు అంటే ఏ ఆడపిల్ల ఒప్పుకుంటుంది ఈ రోజుల్లో?" తల్లి వసుమతి అనుమానం.

"అవునురా కన్నా, డబ్బుకి అంతేముంది? పిచ్చినాగన్న, తిండికి మొహం వాచిపోయాడు. ఎంత సంపాదించినా కడుపు నిండా తిండి లేకపోతే ఆ సంపాదనెందుకు?" మనవడికి వత్తాసు పలికింది బామ్మ నిర్మలమ్మ. కోడలు వసుమతి ఆమెకేసి చురచుర చూసింది.

"మీరూరుకోండి. అసలు వాడినిలా తయారుచేసింది మీరే. వాడు అడిగినవన్నీ ముప్పొద్దులా చేసిపెట్టి వాడిని మేపి ముద్దు చేసి పాడుచేశారు. ఎప్పుడూ తిండిగోలే! కూరేమిటీ, పులుసేమిటీ, అప్పాలు చేయవా, బొబ్బట్లు చెయ్యవా అంటూ వాడు మీ చుట్టూ తిరగడం, చిన్నవెధవ అంటూ మీరు వాడికి రుచులన్నీ మప్పడం... ఇన్నేళ్లు వచ్చినా ఇంకా వాడికి ఆ తిండియావ తగ్గలేదు. ఇప్పుడు చూడండి ఏమైందో?" నిర్మలమ్మను దులిపేసింది కోడలు.

"నీ గోలెప్పుడూ వాడి  తిండిమీదే. కన్నతల్లివేనా నువ్వు?" అంటూ ఆవిడా ఊరుకోకుండా మొదలెట్టింది.

పండగనాడు బొబ్బట్లు చేస్తుంటే రెండేళ్ల పండుని వంటింట్లో పీటమీద కూర్చోపెట్టి వేడి వేడి బొబ్బట్లు మీద నెయ్యి వేసి పెడితే చిన్న ముక్క కూడా కింద పడకుండా బుజ్జిచేతుల్తో ఆప్యాయంగా తింటుంటే చిన్నికృష్ణుడు వెన్న తిన్నట్టు ఎంత ముద్దుగా ఉన్నాడో అనుకుని మురిసిపోయింది. పులిహోర పెడితే కారం తిని చొంగ కార్చుకుంటూ, బొబ్బట్టుముక్క కొరికి నోరు తీపి చేసుకునే మనవడి తెలివికి మురిసిపోయేది. మనవడిని చంకనేసుకుని ఈ చిరుతిండి ఆ చిరుతిండి తినిపిస్తుండేది నిర్మలమ్మ. చిరుతిళ్లే కాదు, మూడు పూటలా ఏది పెట్టినా సుష్టుగా తినేవాడు. 'పిల్లాడసలు తిండికి అల్లరి పెట్టడమ్మా' అని ఇరుగమ్మ పొరుగమ్మల దగ్గర చెప్పి మురిసిపోయేది.

ఎదుగుతున్నకొద్దీ పండుగాడికి రుచుల యావ పెరిగింది. తిండిలో వెరైటీలు పెరిగాయి. ఎదిగే పిల్లాడు ఆకలి ఉండదా, ఆటలాడుకుని వచ్చి తింటే ఇనుప ముక్కలు కూడా అరిగిపోతాయి అంటూ ఇంత నెయ్యి వేసి కందిపచ్చడి కలిపి, ఉల్లిపాయ పులుసు నంచిపెడితే గుటుకు గుటుకు మింగేసేవాడు. మామ్మ ఏది పెట్టినా వద్దనకుండా తిని పెరిగాడు. ఆ రుచులకు అలవాటు పడిపోయాడు. ఇడ్లీ చేస్తే 'ఉట్టి పచ్చడేనా? సాంబారు లేదా?' అనేవాడు. 'దోసెలోకి కూరేనా పచ్చడేది? పెసరట్టుకి అల్లం పచ్చడే కావాలి, పప్పుకూరకి ఇంగువనూనె ఏది?' అని అడిగేవాడు. ఇలా అన్ని రుచులు తెలిసిపోయాయి పండుబాబుకి. విస్తర్లో నాలుగు రకాలున్నా 'పచ్చడే చెయ్యలేదా?' అని డిమాండ్ చేసేవాడు.

"ఏమిట్రా నీ గోల, నోరు మూసుకుని పెట్టింది తిను" అనేది తల్లి.

కోడలు చూడకుండా మడిజాడీ వంచి ఏ చింతకాయో, గోంగూరపచ్చడో తెచ్చి వేసేది మామ్మ. వాడి పదకొండో ఏట "నేనింక ఎన్నాళ్లు బతుకుతానో వాడి పెళ్లి వేళకి ఉంటానో లేదో, ఒడుగు చెయ్యాల్సిందే" అని పంతం పట్టి కొడుకుచేత పండుబాబుకి ఒడుగు చేయించింది మామ్మ.

ఓసారి పక్కింట్లో ఆబ్దికం జరుగుతుంటే ఒక భోక్త ఆఖరి నిమిషంలో రాకపోయేసరికి "మీరేం అనుకోకపోతే పండుని ఒక్క అరగంట పంపిస్తారా? భోంచేసి వచ్చేస్తాడు. ఆదివారం ఇంట్లోనే ఉన్నాడు గదా!" అని పెద్దమనిషి వచ్చి అడిగితే కాదనలేక ఒప్పుకున్నారు.

"మామ్మా! తద్దినం భోజనం ఎంత బాగుందో! నాలుగు కూరలు, నాలుగు పచ్చళ్లు, నాలుగు పిండివంటలు, నువ్వుల పచ్చడి, అల్లంపచ్చడితో నాలుగు గారెలు లాగించాను" పదమూడేళ్ల మనవడి మాటలు విని మామ్మ నవ్వితే "వెధవా! మరింకేం తద్దినాల భోక్తగా వెడుతూ ఉంటే సరి, దక్షిణ కూడా ముడుతుంది" అంటూ తల్లి మొట్టికాయ వేసింది.

వయసుతోపాటు తిండియావ ఎక్కువైంది పండుబాబుకి. హైస్కూలు, కాలేజీ చదువులయ్యాక, ఉన్న ఊళ్లోనే ఇంజనీరింగ్ చదవడంతో భోజనం ఇబ్బంది లేకుండా జరిగిపోయింది. అమెరికా వెళ్లను మొర్రో, ఎమ్మెస్ వద్దు ఇక్కడే ఏదో ఉద్యోగం చూసుకుంటాను అని వాదించి గోల పెట్టినా, "అక్కడ ఉండొద్దులే, ఎమ్మెస్ చేస్తే జాబ్ అవకాశాలు బాగా ఉంటాయి" అని నెమ్మదిగా నచ్చచెప్పి ఎలాగో పంపించారు తల్లీతండ్రీ.

రెండేళ్లు నానాగడ్డీ కరిచి తిండికి మొహం వాచి నిజంగానే ఏడ్చేవాడు. ఏ గుళ్లోనన్నా ప్రసాదాలు పెడితే వెళ్లిపోయేవాడు. స్నేహితులు పిలిస్తే వెళ్లి కక్కుర్తిగా తిని వచ్చేవాడు. ఏడాది సెలవులకు వచ్చి ఓ పెట్టి నిండా పచ్చళ్లు, పొడులు, ఊరగాయలు పట్టుకెళ్లి ఎలాగో నెట్టుకొచ్చాడు. తిండికి ఎంత ఇబ్బంది పడ్డా చదువు పూర్తయిపోగానే ఉద్యోగంలో వచ్చిన జీతం డాలర్లని రూపాయల్లోకి గుణించి చూసేసరికి ఇంకో పదేళ్లు ఇండియాలో ఉద్యోగం చేసినా ఇంత జీతం రాదని డిసైడై, ఇండియా వెళ్లాలన్న కోరిక అణుచుకుని కాలక్షేపం చేస్తూ వచ్చాడు. 'తన ప్రాబ్లమ్ సాల్వ్ అవ్వాలంటే పెళ్లి ఒక్కటే దారి' అనే నిర్ణయానికి వచ్చాడు పండుబాబు.

"అది సరే, మరి 'వంట చేసుకుంటూ ఇంట్లో కూర్చో' అంటే ఏ అమ్మాయి ఒప్పుకుంటుంది ఈ రోజుల్లో?" తండ్రి మళ్లీ అడిగాడు.

"అందుకే ఎక్కువ చదువుకోకుండా బి.ఏ, బి.కాం చదివిన మధ్యతరగతి అమ్మాయి అయితే అమెరికా కాపురం అని చెప్పగానే ఎగిరి గంతేసిఖ ఒప్పుకుంటుంది" నమ్మకంగా అన్నాడు పండుబాబు.

నిజంగానే అలాగే ఎగిరి గంతేసి ఒప్పుసుకుంది శ్రీవల్లి. కల్యాణం వచ్చినా కక్కు వచ్చినా ఆగదన్నట్టు ఆన్‌లైన్‌లో మేట్రిమోనియల్ కాలమ్‌లో ప్రకటన ఇవ్వడమేమిటి, పదిహేనుమంది పోస్టు చేయడం, సంప్రదింపులు, కుటుంబ వివరాలు చూడ్డాలూ, జాతకాలు తిరగేయడాలూ పూర్తయ్యాక, అబ్బాయి షరతులకి ఒప్పుకున్నవాళ్ల ఫొటోలు చూసి అందులోంచి ముగ్గురిని సెలెక్టు చేసుకుని, ఇద్దరిని రిజెక్ట్ చేశాడు. శ్రీవల్లిని ఎంచుకున్నాడు పండు ఉరఫ్ చైతన్య.

పెళ్లిచూపుల్లో అబ్బాయిని, అమ్మాయిని వేరే గదిలో కూర్చుని మాట్లాడుకోమంటే అబ్బాయిగారు అడిగిన మొదటి ప్రశ్న "నా ప్రకటనలో పాయింట్లు చదివావా? నా ఇష్టం అంటూ ఉద్యోగం చేయకూడదు, వంట చేసుకుంటూ ఇల్లు చూసుకుంటే చాలు" అని అడిగేశాడు.

అమ్మాయి గబగబా తల ఊపేసింది. 'నా బొంద! బీకాం ఫెయిల్‌కి అమెరికాలో ఉద్యోగం ఎవడిస్తాడు? పాడు ఉద్యోగం నాకెందుకు? అమెరికా ఎగిరిపోయి, ఎంజాయ్ చేస్తూ తనవాళ్లందరి దగ్గరా అమ్మో! శ్రీవల్లి ఎంత అదృష్టవంతురాలో, అమెరికా సంబంధం వచ్చింది అని గొప్పగా అనిపించుకోవాలి' అని ఆ అమ్మాయి ఆరాటం.

అసలు తనకింత అదృష్టం పడుతుందని అనుకుందా? "ఆ బీకాం అన్నా కంప్లీట్ చేయవే, లేకపోతే పెళ్లెలా అవుతుందే నీ మొహంమండా!" అని తల్లి తిట్టిపోసేది. చదువు లేదని అప్పటికి ఆరు సంబంధాలు తప్పిపోయాయి. అందం ఏదో సో, సో. ఫ్యామిలీ అంతకంటే సో, సో. తంతే బూరెల బుట్టలో పడ్డట్టు ఉక్కిరిబిక్కిరైపోతోంది శ్రీవల్లి. "అవునూ, అబ్బాయివాళ్లిచ్చిన ప్రకటనలో స్పష్టంగా వంటావార్పూ వచ్చిన అమ్మాయన్నారు. దీని మొహం దీనికేం వంటొచ్చే?" ఆ తండ్రి సందేహంగా అన్నాడు.

"ఎందుకు రాదు? బంగాళదుంపలు వేయిస్తా, పప్పు చేస్తా, చారు వచ్చు, మొన్న పులుసు వండేగా! అమ్మకి హార్ట్ అటాక్ వచ్చినప్పుడు నేను చేయలేదా?" గబగబా అనేసింది శ్రీవల్లి.

"ఏడిశావు, నోరు మూసుకో. వంట అంటే నాలుగు బంగాళదుంపలో, అరటికాయలో వేయించడమేమిటి? ఆ అబ్బాయి అడిగితే వచ్చు అని చెప్పు. ఇలా వాగకు. ఈలోగా ఐదారు రకాలు గబగబా నేర్పిస్తా" కూతురికి హితబోధ చేసింది తల్లి.

"వంట చెయ్యడం వచ్చు గదా, నాకు తెలుగు వంటలు నచ్చుతాయి. అక్కడ అమెరికాలో నాలుగేళ్లుగా తిండికి మొహం వాచిపోయినట్లయింది. ఏదో ఇండియన్ రెస్టారెంట్లలో ఇడ్లీ, సాంబారు, దోసెలాంటివి దొరుకుతాయి గానీ, మన అచ్చతెలుగు ంటలు దొరకవు. అందుకే అడుగుతున్నా ప్రత్యేకంగా" అడిగాడు.

శ్రీవల్లి మొహంలో రంగులు మారినా అది కనపడకుండా నవ్వేసి తల ఊపింది.

పెళ్లికొడుకూ తల ఊపేశాడు. నెల రోజులు సెలవు మీద వచ్చాడు. పెళ్లి చేసుకుని వెళ్లిపోవాలి. మళ్లీ మళ్లీ రాలేడు. వారం రోజుల్లో ముహూర్తం. పెళ్లికొడుకు తల్లిదండ్రులు మాత్రం సంతోషంగా లేరు. పెళ్లికూతురు చూడడానికి ఫరవాలేదు. పెద్ద చదువులు చదివి, ఉద్యోగం చేయకుండా, అదీ మామూలు కుటుంబంలోంచి వచ్చి, మామూలు చదువులు చదివిన పిల్లని కోడలుగా చేసుకోవడంతో నలుగురిలో చిన్నతనంగా ఫీలయ్యారు. కొడుకు నిర్ణయాన్ని మార్చలేక ఆఖరికి ఎవరికెవరు రాసిపెట్టి ఉన్నారో అనుకుని సర్దుకున్నారు.

❖ ❖ ❖

"నిన్నెందుకు చేసుకున్నానో తెలుసా?" శోభనం రాత్రి అన్నాడు పండుబాబు.

"మంచి చదువు, ఉద్యోగం ఉండి అమెరికాలో ఉద్యోగం చేయగలిగిన అమ్మాయిని కాకుండా నిన్నే కోరి చేసుకున్నది దేనికో తెలుసా?" అడిగాడు.

కళ్లు పెద్దవి చేసి చూస్తూ ఉండిపోయింది శ్రీవల్లి.

"నాకు చిన్నప్పటినుంచీ మంచి మంచి రుచులతో తెలుగు భోజనం తినడం ఇష్టం. మా మామ్మ చేతివంట నన్నలా తయారుచేసింది. ఇప్పుడు ఇంక నీవు నాకు కావల్సినట్టు, నే చెప్పినట్టు 'అన్నీ' చేసిపెట్టాలి తెలుసా? అందుకే వంట వచ్చిన అమ్మాయి కావాలనుకున్నా."

"అన్నీ అంటే?" మనసులో భయపడుతూ అడిగింది శ్రీవల్లి.

"చూడు... మన తెలుగు వంటల ప్రత్యేకత తెలుసా? ఒక్క వంకాయనే పదీ పదిహేను రకాలుగా వండుకోవచ్చు. అందరూ ఇంత అల్లం, వెల్లుల్లి, టమోటాలు వేసేస్తున్నారు అన్ని కూరల్లో. ఒకటే రుచితో ఏడుస్తున్నాయి ఇప్పటి వంటలు. వంకాయ గుత్తికూర, పచ్చికారం, వంకాయ ముద్ద, ఉల్లికారం, పచ్చిపులుసూ యిలా రకాలు..."

శోభనం రోజు మంచంమీద కూర్చుని వంకాయకూర గురించి మాట్లాడుతున్న మొగుణ్ణి ఆశ్చర్యంగానే చూసి ధైర్యం తెచ్చుకుని "నాకూ వంటొచ్చు గానీ ఇన్నేసి రకాలు రావు" అనేసింది. పెళ్లైపోయింది, ఇప్పుడింక దాపరికం ఎందుకని.

"ఏంటీ రావా? మరి వంటొచ్చు అన్నావుగా?" పండుబాబు మొహం కళ తప్పింది.

"ఏదో రోజువారీ వంటలు..."

"అంటే బొబ్బట్లు రావా, పులిహోర చేయడం వచ్చా, దూదుల్లా పెరుగు గారెలు చెయ్యలేవా? కరకరలాడే అల్లంగారెలు రావా? చక్కటి బియ్యం పరమాన్నం, చక్రపొంగలి, మెత్తటి అప్పాలు... ఇవన్నీ వచ్చా?"

"బాబోయ్, ఇవన్నీ పిండివంటలు. నాకెలా వస్తాయి? ఏదో మామూలు రోజువారివి..." పండుబాబుగారి నల్లబడిన మొహం ఎరుపురంగులోకి మారింది.

"పోనీ పాతోళి, ఉల్లిపాయ పులుసు, కొబ్బరి మామిడి పచ్చడి, కందిపచ్చడి, ఇంగువేసిన పచ్చిపెసరపచ్చడి, పనసపొట్టు కూర..."

పెళ్లికూతురు బిక్కమొహం వేసింది.

"ఏమిటీ, ఇవేం రావా? మరి వంట వచ్చా అంటే వచ్చని అబద్ధం చెపుతావా?" కోపంతో మాట వణికింది.

"వంట అంటే మామూలు వంటనుకున్నా" ధైర్యంగానే అనేసింది.

ఒక్కక్షణం నిరుత్తరుడైపోయాడు పండుబాబు. "మోసం, దగా!" అన్నాడు కోపంగా. అంటూనే విసురుగా లేచి తలుపు తీసి బయటికి వెళ్లిపోయాడు. పెళ్లికూతురు బిక్కమొహం వేసింది.

హాల్లో పడుకున్న నిర్మలమ్మ మనవడు శోభనం గదిలోంచి విసురుగా రావడం చూసి గాభరాగా లేచి కూర్చుంది. "ఏమిట్రా నాన్నా, ఇలా బయటికి వచ్చావు? ఏం కావాలి?" అంది ఆరాటంగా.

"మామ్మా! మోసం, దగా. అన్నీ అబద్ధాలు చెప్పారు మామ్మా! వంట వచ్చని అబద్ధం చెప్పింది. ప్రత్యేకంగా అడిగినా అలా చెప్పింది. ఇప్పుడడిగితే ఏదో రోజూ చేసే వంట కాస్త వచ్చు అంటోంది" కోపంతో పండుబాబు మాటలు తడబడ్డాయి.

"ఒరేయ్ నాన్నా! తప్పురా, అలా శోభనం గదిలోంచి బయటకు రాకూడదు. రేపు మాట్లాడదాం. లోపలికెళ్లు ముందు."

"నేను వెళ్లను. నాతో అబద్ధాలు చెప్పింది. నాకొద్దీ పెళ్లి, పొమ్మను తనని."

"ఒరేయ్! పిచ్చిగానీ ఎక్కిందా? పెళ్లంటే ఏమిటనుకున్నావ్? ఆట అనుకున్నావా? అంత సులువుగా తెగిపోయే బంధం కాదు. ముందు లోపలికి వెళ్లు. వంటకేం భాగ్యం! ఓ నెల్లాళ్లు ఇక్కడే అట్టేపెట్టి వెళ్లు. అన్నీ నేర్పి పంపిస్తా. ముందు నువ్వు లోపలికెళ్లు" గదమాయించింది మామ్మ.

"నేను వెళ్లను. అన్నీ నేర్పి పంపించు. అప్పుడే శోభనం!" మొండిగా అని సోఫాలో పడుకుండిపోయాడు.

తరువాత ఎంత గోల జరగాలో అంతా జరిగింది. తల్లీ, తండ్రి తల వాచేట్టు చివాట్లు పెట్టారు. అత్తగారు, మామగారు వచ్చి మొత్తుకున్నారు. "అదేమన్నా వంటలక్కా? అన్ని వంటలూ రావడానికి. నెమ్మదిగా ఒక్కొక్కటే అదే నేర్చుకుంటుంది. దానికోసం కాపురం చెయ్యవా?" నిలేశాడు మామగారు.

"ముందే అడిగా. దానికోసమే తక్కువ చదువుకున్న పిల్లని చేసుకున్నా. లేకపోతే ఉద్యోగం చేసే అమ్మాయినే చేసుకునేవాడిని. డబ్బు అయినా వచ్చేది" దబాయించి తెగేసి చెప్పాడు. అంతా కలిసి నచ్చచెప్పి ఆఖరికి అందరూ కలిసి ఓ నిర్ణయం చేశారు, రెండు నెలల్లో అమ్మాయికి వంటలన్నీ నేర్పి, పంపేట్టు.

"సరే, ఈలోగా వీసా, టిక్కట్లు ఏర్పాటు చేస్తా. అప్పుడే కాపురం" అంటూ అమెరికా వెళ్లిపోయాడు పండుబాబు.

"వీడి తిండిగోల ఇంత దూరం వస్తుందనుకోలేదు. ఇంత తిండియావ ఏమిటి వీడికి?" తల మొత్తుకుంది వసుమతి. అత్తగారి వంక గుర్రుగా చూసింది.

"ఏమిటే ఆ చూపు! నన్ను మింగేసేట్టు" అరిచింది మామ్మగారు.

"మిమ్మల్ని కాక ఇంకెవరిని అనాలి? చిన్నప్పటినుంచీ వాడికి ఇవన్నీ నేర్పింది మీరు కాదూ..."

"ఆపండి, మీ ఇద్దరూ. అమ్మా, వాడికి కావాల్సినట్టు ఈ రెండు నెలల్లో ఆ అమ్మాయికి అన్నీ నేర్పించు. ఆ బాధ్యత నీదే!" అని తల్లికి చెప్పి, "అలాగే ఆ అమ్మాయికి కాస్త ఇంగ్లీషు కూడా మాట్లాడటం నేర్పు. నీవల్ల కాకపోతే స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులో చేర్పు. మళ్లీ అమెరికా వెళ్లాక అక్కడ కష్టం అవుతుంది లేకపోతే" అన్నాడు భార్యతో పండుబాబు తండ్రి.

❖ ❖ ❖

రెండు నెలల్లో పాకప్రావీణ్యం సంపాదించి అమెరికా గడ్డమీద కాలు మోపింది శ్రీవల్లి. పైకి మామూలుగానే ఉన్నా, శోభనంనాడు మొగుడు చేసిన అవమానం మరచిపోలేదు. 'ఏదో అమెరికా అని సహించాను గానీ, లేకపోతేనా?' అనుకుంది మనసులో. పంతంపట్టి మామ్మగారిదగ్గర, అత్తగారి దగ్గర, యూట్యూబ్‌లోనూ, అన్ని చానల్స్‌లోనూ వచ్చే వంటలన్నీ చూడడమే శ్రీవల్లికి దినచర్యగా మారిపోయింది ఆ రెండు నెలలూ.

కొత్తకాపురంలో మొదటిసారి భార్య చేతివంట తిన్నాక పండుబాబు మొహం వికసించింది. "గుడ్ సర్టిఫికెట్ ఇవ్వచ్చు" అనేశాడు. నవ్వుమొహంలేని భార్యని చూసి "సారీ వల్లీ! కోపం వచ్చిందా? అలా అనకపోతే నువ్వు ఇవాళ ఇంత బాగా వండేదానివా? నీకు వంట రాకపోతే రోజూ మన మధ్య గొడవలు వచ్చేవి. కానీ ఇప్పుడింక..." అంటూ భార్యని చుట్టేసి కౌగిలిలోకి లాక్కున్నాడు పండుబాబు.

రోజూ తన పాకప్రావీణ్యంతో ఎడాపెడా వంటలు, పిండివంటలు, రకరకాల రుచులు చూపించేసి భర్తగారి పొగడ్తలు, అభిమానం, ప్రేమ అన్నీ పొందేసి నెలరోజులకల్లా మొగుడిని కొంగున కట్టేసుకుంది శ్రీవల్లి. నాలుగేళ్లుగా మిస్సైన రుచులన్నింటినీ నెలరోజులపాటు తనివితీరా ఆస్వాదించి తృప్తిగా బ్రేవ్‌మని తేన్చేసరికి, శరీరం ఓ రెండు కేజీలు పెరిగి, పర్సు చిక్కిపోయింది. చిక్కిన పర్సు చూసి బెంబేలెత్తిపోయి "ఏమిటీ? సరుకులన్నీ అయిపోయాయా? అప్పుడే! మూణ్ణెల్లకి సరిపడా కొని పడేశానుగదా!" అన్నాడు.

"రెండు పూటలా స్వీట్‌లు, హాట్లు, రెండు కూరలు, నాలుగు పచ్చళ్లు, ఆరు పప్పులు తింటే అయిపోవా డియర్ హజ్బెండ్!" అంది గోముగా శ్రీవల్లి.

"ఇదిగో ఇంక చాలు, రోజూ ఇలా తింటే ఇల్లు, ఒళ్లు గుల్లవుతుంది. రోజూ ఇన్ని చెయ్యాలంటే నీకూ ఓపిక ఉండాలిగా! ఇంక మామూలు వంట వండు."

"నా మాటకేంలెండి. వంట చెయ్యడానికేగా నేనున్నాను" అదను చూసి దెబ్బ కొట్టింది శ్రీవల్లి.

"ఇదిగో పెళ్లిచేసుకున్నావు. పార్టీ ఏది అని నా బెస్ట్ ఫ్రెండ్స్ ఇద్దరు ముగ్గురు చంపుతున్నారు. రేపు ఆదివారం వాళ్లని మన ఇంటికి పిలుస్తా. నీ పాకప్రావీణ్యమంతా చూపించు. ఇంక ఆ తరువాత సింపుల్ మీల్. అలా అని రుచీపచీ లేకుండా కాదు. చేసింది రెండు వంటలైనా రుచి అదరాలి" చెప్పి బయటికెళ్లిపోయాడు పండుబాబు.

❖ ❖ ❖

"బాబోయ్, మీ ఆవిడ వంటలు తిన్నాక, ఇంక రేపటినుంచీ మా మొగుళ్లు మమ్మల్ని బతకనీయరు. ఆవిడ్ని చూడు అంటూ దెప్పిపొడుస్తారు" అంది ప్రసాద్ భార్య యామిని.

పర్ఫెక్ట్. వంటలు ఎంతో బాగా కుదిరాయి. ఎన్నాళ్లుగానో తినడానికి నోచుకోని భోజనం దొరకడంతో ఆ మూడు జంటలూ ఆవురావురుమని గిన్నెలు ఖాళీ చేశాయి. పండుబాబు గర్వంగా కాలరెగరేశాడు. మంచి చదువు చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తున్న ఆంటీ తనను మెచ్చుకోవడంతో పొంగిపోయింది శ్రీవల్లి. పైకి మాత్రం "నాదేముందిలెండి. వంట చేయడమే వచ్చు. నాకు మీలా చదువులూ, ఉద్యోగాలూ లేవుగా! ఏదో వానాకాలం చదువు నాది" మొగుడి వంక చూస్తూ అంది కావాలనే.

"వదినగారూ, మీరు తక్షణమే ఓ కేటరింగ్ ఓపెన్ చేసేయండి. ఆర్డర్లమీద ఆర్డర్లు, డాలర్లమీద డాలర్లు వచ్చిపడతాయి. మా ఉద్యోగాలెందుకూ పనికిరావండీ మీ సంపాదన ముందు. అచ్చతెలుగు తిండికి బాచిలర్స్ మొహం వాచి ఉన్నారు. చిన్న చిన్న పార్టీలు, ఫంక్షన్లకి తెలుగువారందరూ దండం పెడుతూ ఆర్డరిస్తారు" ఊరించి చెప్పాడు వంశీ.

"అవునవును. ముందు బోణీ నాదే. ఆదివారం లంచ్ ఆర్డర్ నాదే!" సుబ్రహ్మణ్యం అన్నాడు నవ్వి.

"హాయిగా ఆదివారం వండుకోవడం, తోముకోవడం లేకుండా సెలవు ఎంజాయ్ చేస్తాం" అంటూ తలోమాట అనేశారు. వాళ్లు అలా తలో మాట అని వెళ్లాక ఆ మాటలన్నీ వల్లీ బుర్రను తొలవడం ఆరంభించాయి.

"మతిపోయిందా? వాళ్లేదో సరదాగా అన్నారు. కేటరింగ్ అంటే తమాషా అనుకున్నావా?" పెళ్లాం మాటలు విని అరిచాడు పండు.

"ముందే పెద్ద ఎత్తున కాకుండా రోజూ ఆరేడు లంచ్ పాకెట్లు, మనం వండుకునేదే కాస్త ఎక్కువ చేస్తే చాలు. యామినిగారిని అడిగా ఆవిడ ఒక గుజరాతీ ఆవిడ చేస్తున్నారని నంబరిస్తే మాట్లాడా. ముందు చిన్నగా ఆరంభించమంది. రోజుకో వంద డాలర్ల ఆర్డర్లతో ఆరంభించమంది."

"అప్పుడే వివరాలన్నీ సేకరించావా? ఫరవాలేదే! అమెరికా గాలి నెల్లాళ్లకే వంటబట్టి ఆరితేరిపోయావా?" హేళనగా అన్నాడు.

"చదువు లేదు, ఉద్యోగం ఎలాగూ రాదు. ఏ చిన్న ఉద్యోగం చెయ్యాలన్నా ఇల్లొదిలి బయటకెళ్లి రోజంతా కష్టపడే బదులు ఇంట్లోనే ఉండి కాస్త నా ఖర్చులకి సంపాదించుకుంటా, ప్రతిదానికి మిమ్మల్ని అడగక్కరలేకుండా. నాకూ డబ్బవసరముంటుందిగా?" పండుబాబుకి నిర్ణయం చెప్పేసింది శ్రీవల్లి.

'పోన్లే ఏదో ఇంట్లో ఉండి వంట చేసుకుంటుందిలే, తన పాట్లు తనే పడుతుందిలే, తనని డబ్బుకోసం చంపకపోతే మాత్రం చాలు' అనుకున్నాడు పండుబాబు.

❖ ❖ ❖

ఏదో వంటింట్లో పని చేసుకుంటుంది, నాలుగు డబ్బులు సంపాదించుకోనీ అనుకున్న పండుబాబు ఆలోచనలన్నింటినీ ఒక్క ఏడాదిలోనే తలకిందులు చేసేసింది శ్రీవల్లి. పండు సంపాదన మించిపోయే రీతిలో 'శ్రీవల్లీ హోమ్‌ఫుడ్స్ కేటరింగ్ సర్వీస్' ఓపెన్ చేసే స్థాయికి ఎదిగిపోతుందనుకోలేదు పండుబాబు. పండు ఏమనడానికీ లేదు. ఒకవేళ అన్నా వినే స్టేజి దాటిపోయింది శ్రీవల్లి. ఆ విషయం గ్రహించి నోరు మూసుకున్నాడు. డబ్బు చేదుగాదు కదా!

లంచ్ ప్యాక్‌లతో మొదలై, చిన్న చిన్న పార్టీలు, ఫంక్షన్లకి ఆర్డరు తీసుకుంటూ, తనతోపాటు ఇంట్లో ఉండే అమ్మాయిని పేయింగ్ గెస్ట్‌గా కుదర్చుకుని ఇద్దరూ కలిసి ఆర్డర్లు తీసుకుంటూ ఆర్నెల్లలో మంచి తెలుగు భోజనం పెడుతున్నారు అనిపించుకుని డాలర్లు పోగుచేసుకునేలా బిజినెస్ మొదలుపెట్టారు. నార్త్ ఇండియన్ డిషెస్ కావాలన్నా కూడా సప్లయ్ చేస్తున్నారు. డిమాండ్ పెరగగానే గుజరాతీ ఆవిడతో లింకు పెట్టుకుని నార్త్ ఇండియన్ డిషెస్ ఆవిడచేత చేయిస్తూ బిజినెస్ టాక్టిక్స్ వంటబట్టించుకుంది శ్రీవల్లి. ఎడాపెడా ఇంగ్లీషు దంచి పారేస్తూ గడుసుతనం సంపాదించి, పక్కా బిజినెస్ ఉమన్ అవతారం ఎత్తింది.

భార్యని చూసి 'డబ్బు సంపాదనకి, చదువుకి సంబంధం లేదు' అనే విషయం గుర్తించడానికి ఏడాది పట్టింది పండుబాబుకి. ఇప్పుడు 'మిసెస్ పండు కాదు, మేడమ్ శ్రీవల్లి' అని పిలిపించుకునే స్థాయికి ఎదిగిపోయింది. రెండేళ్లలో ఒక హెల్పర్లా అరడజనుమందయ్యారు. పక్కనున్న ఫ్లాట్ అద్దెకు తీసుకుని రాత్రిం బగళ్లు కష్టపడుతున్న పెళ్లాన్ని తనకి కావల్సిన వంట చేసిపెట్టమని అడగలేకపోతున్నాడు. తన ఆలోచన బూమ్‌రాంగ్ అయిందని, శ్రీవల్లి చేయి దాటిపోయిందని అర్థమైపోయింది అతగాడికి.

"ఇన్ని వంటలెదురుగా ఉన్నాయి, కావాల్సినవి తినండి, మీకోసం మళ్లీ వేరే వంట కుదరదని" చెప్పేసింది శ్రీవల్లి.

తెలుగువంట తప్ప తినడం ఇష్టం లేని పండు ఇప్పుడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌కి సమోసాలో, కచోరీలో, డోక్లాలో తింటున్నాడు. పప్పు, ముక్కలపులుసు బదులు సాంబారు, రాత్రి చపాతీలు, కుర్మా, బేల్ తినడానికి అలవాటు పడిపోయాడు. ఇడ్లీ, దోసెలు ఆదివారం స్పెషల్స్ అయ్యాయి. భార్యగారి మెనూలో ఉన్నవాటిల్లో ఏదో ఒకటి ఎంచుకుని ప్లేట్లలో వడ్డించుకుని తన ఇంట్లోకి తెచ్చుకుతింటాడు పండుబాబు బుద్ధిమంతుడిలా. 'వంట-ఇల్లు' రెంటినీ చక్కబెట్టుకుంటుందనుకున్న భార్య 'వంటే చేస్తుందని', 'ఇల్లు చూడదని' అర్థమైపోయింది. రేపు పిల్లలు పుట్టాక నేపీలు మార్చి పాలసీసాలు కడిగి పాలు పట్టడం ఇక తన పనే అని అర్థమైపోయింది పండుబాబుకి.

❖❖❖❖❖

SoftLabs® Demands Delivered
IT CONSULTING SERVICES COMPANY
TRAINING SERVICES
- SOFTWARE TESTING
- PRE SALES ANALYSIS
- BUSINESS ANALYSIS
- AGILE TRAINING
CONSULTING SERVICES
- CONTRACT MANAGEMENT
- PAYROLL MANAGEMENT
- RESOURCE MANAGEMENT
- STAFFING
CONTACT : SREENI PILLAMARRI P: 0410 756 040 | E :BUSINESS@SOFTLABS.COM.AU | W: WWW.SOFTLABS.COM.AU
SYDNEY | MELBOURNE | CANBERRA | ADELAIDE | BRISBANE | PERTH | TASMANIA

❖❖❖❖❖




❖❖❖❖❖

చదివి చదివి కొంత చదువంగ చదువంగ
చదువు చదివి యింక జదువు చదివి
చదువు మర్మములను చదువలేడయ్యెను
విశ్వదాభిరామ వినురవేమ

❖❖❖❖❖


SIRI SAMPADA'S
TELUGU VOICE OF AUSTRALIA
WHY INVEST WITH US ?
Duplex villas starting at just ₹34.99lakhs
Located right next to a 1000 acre Green Special Economic Zone On Hyderabad - Bangalore NH 44
Assured monthly returns Upto ₹15000 a month
THE WHITE VILLAS
JADCHERLA
+91 98854 54012 - +91 9908502222
SIRI SAMPADA
Trust . Innovation . Tradition
www.sirisampada.com
In Association With
Telugu Association Sydney

# తెలుగు అక్షర రహస్యాలు తెలుసుకుందాం

శ్రీ శనగవరపు ఉమామహేశ్, మెల్ బోర్న్

మానవుని నోటిలో శబ్ద ఉత్పత్తి స్థానము ఆధారముగా ఏర్పరుచుకొన్న సూత్రాల ననుసరించి అక్షర మాల సృష్టించబడినది. ఆంగ్లములో, ఏ తర్వాత బీ తర్వాత సీ ఎందుకు వస్తుందో తెలియదు కానీ, మన అక్షరముల కూర్పులో శాస్త్రీయత, వైజ్ఞానికత ఉన్నది. 3000 సంవత్సరముల పూర్వమే, భారతీయ వైదిక భాషావేత్తలు మానవుని ముఖగోళము లోగల అనేక శబ్ద ఉత్పత్తి స్థానాలను అత్యంత జాగురూకతతో పరిశీలించి విశ్లేషించి వాటిననుసరించి అర్థవంతముగా అక్షర క్రమము ఏర్పరచారు. ఈ అక్షరక్రమము నేటికీ బిలియన్ల మందిచే నిత్య జీవితములో వాడబడుతున్నది. అక్షరములు కేవలము భారతీయులు భాషలకే కాక విజ్ఞాన శాస్త్ర ఆవిష్కరణలకూ ఉపయోగపడినవి. మొట్టమొదట ప్రపంచానికి సున్నను మరియు దశాంశమానాన్ని భారతీయ గణిత శాస్త్రవేత్తలు సిద్ధాంతీకరించి అందించారనడము నిర్వివాదాంశము. ప్రపంచపు తొలి నిర్దిష్ట సాహిత్యమైన వేద భాగాల్లో 1నుండి 9 అంకెలు,దశాంశ మానము, బేసి సరి సంఖ్యలు విరివిగా వాడబడ్డాయి. ఖగోళ గ్రహాల దూరాలు లెక్క కట్టే అతి పెద్ద సంఖ్యలకు వాటి దశాంశ స్థానములకు అక్షరములను వాడిన ఘనత ఆర్యభట్టుది. ఈ "క ట ప య" (కాది నవ టాది నవ పాది పంచ యాద్యష్ట ) అక్షరముల ద్వారా నిర్మించిన చిన్న పదాల రూపంలో ఖగోళ సత్యాలను కొన్ని వేల సంవత్సరములకు పూర్వమే ప్రపంచానికందించాడు. ఇదే స్ఫూర్తితో మరికొందరు సంగీత వేత్తలు, 72 మూల సంగీత రాగాలను ఈ అక్షర విధానంలోనే సులభంగా విభజించారు. అక్షరమాల కూర్పుకు చెందిన రహస్యాలు క్రింది సూత్రముల ఆధారముగా వివరిస్తాను గమనించండి. సూత్రాలు ఒక రకంగా గణితపు లేదా సైన్సు ఫార్ములే లాంటివి. అంతే కాక, అక్షర మాల పట్టిక, కెమిస్ట్రీ ఎలెమెన్ట్స్ టెబిల్ లాగా ఆలోచనావంతంగా ఏర్పర్చబడినది. ఎలిమెంట్స్ కలిస్తే కాంపౌన్డ్స్ వచ్చినట్లు క్రమ క్రమముగా విజ్ఞానాత్మకముగా మూల అక్షరములను దీర్ఘాలు, గుణింతాలు, సంధులు మొదలైన ప్రక్రియలతో విస్తరించుకొనవచ్చును. సులభంగా తార్కికంగా పిల్లలకు నేర్పించవచ్చు. ఫొనెటిక్ సూత్రాల విజ్ఞానమునకు ప్రతిరూపమైన తెలుగు లిపిలో అన్ని భాషా పదాలను మాండలిక శబ్దాలను ఎలా పలుకుతామో అలానే రక్షించుకోవచ్చును.

**సజాతీయ వర్గాలైన క చ ట త ప ల వెనుక రహస్యాలు:**

సూత్రము 1- అ కు హ విసర్జనీయానాం కంఠః : అ, క వర్గము (క ఖ గ ఘ ఙ) , హ, విసర్గ కంఠ్యాలు (సూత్రములో కు అనగా క వర్గము)
సూత్రము 2- ఇ చు య శానాం తాలు : ఇ, చ వర్గము (చ ఛ జ ఝ ఞ) , య, శ, తాలువులు, అనగా దవడను విస్తరించి పలుకునవి.
సూత్రము 3- ఋ టు ర షాణాం మూర్ధా : ఋ, ట వర్గము (ట ఠ డ ఢ ణ) , ర, ష మూర్ధన్యాక్షరములు - అనగా నాలుకను మాడు వైపుకు పైకి పెట్టి పలుక వలసినవి.
సూత్రము 4- ౡ తు ల సానాం దన్త్యాః : ౡ, త వర్గము (త థ ద ధ న) , ల, స దంత్యములు
సూత్రము 5- ఉపూ ఉపధ్మనీయా నాం ఓష్ఠౌ : ఉ, ప వర్గము (ప ఫ బ భ మ) ఉపధ్మలు పెదవులననుసరించి పలుకునవి. (ఉపధ్మల అవసరం వైదిక పద కోశంలో వస్తుంది, సమయాభావము వలన ఇక్కడ చర్చించుట లేదు)

పై అయిదు సూత్రములు క్రింది సజాతీయ వరుసలను తయారు చేస్తాయి.

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| అ | | క | ఖ | గ | ఘ | ఙ | | హ | ః |
| ఇ | | చ | ఛ | జ | ఝ | ఞ | య | శ | |
| ఋ | | ట | ఠ | డ | ఢ | ణ | ర | ష | |
| ౡ | | త | థ | ద | ధ | న | ల | స | |
| ఉ | | ప | ఫ | బ | భ | మ | | | |

మరొక మాట, క చ ట త ప వర్గాల్లోని వరుస ఊరకె ఏర్పరచలేదు..దానిలో కూడా మరింత వైజ్ఞానికత ఉన్నది. ఇవి "బాహ్య ప్రయత్నము" ఆధారముగా కూర్చబడ్డాయి. ఉదాహరణకు క వర్గములోని "క-ఖ-గ-ఘ-ఙ" పరిశీలిస్తే, మొదటి అక్షరమైన "క" (పరుషము) ను అఘోషము అంటారు. దాన్ని నాద ఘోషలతో గొంతు వెడల్పు చేసి పలికితే "గ" (సరళము) వస్తుంది; 'గ' ను ముక్కుతో పలికితే 'ఙ' పుట్టుంది ; క మరియు గ ల యొక్క మహా ప్రాణము (అంటే ఎక్కువ ఊపిరితో పలకడం) ఖ, ఘ వాటి ప్రక్కనే అమర్చబడ్డాయి. కనుక క చ ట త ప లను పరుషములనీ, గ జ డ ద బ లను సరళములన్నారు. ఊపిరి బలంగా ఆడితే మహా ప్రాణమని, లేనిచో అల్ప ప్రాణమని నిర్వచించారు. ముక్కుతో పలకబడటంచేత ఙ ను అనునాసిక అన్నారు.

మనము సాధారణంగా "అ - క చ ట త ప- య- శ" అనబడే వరుసలో అక్షరములు వ్రాస్తాము. అనగా మొదట, అ నుండి అః వరకు అచ్చులు, తర్వాత క, చ , ట, త, ప వర్గాలు వ్రాసి ; ఆపై "య ర ల వ" వర్గము, చివరిగా "శ ష స హ" వర్గము తో ముగిస్తాము. ఈ విధానమునకు మూలము కరణము(కదిలే ఉపకరణ), స్థానము(కదలని ఉపకరణ) ఆధారముగా చేసుకుని జరిగే "అభ్యంతర ప్రయత్నము". ఈ కరణము స్థానము ఒక దాన్ని ఒకటి స్పర్శించబడుతున్నవా లేదా, ఎంత దూరములో ఒక దానికొకటి ఉన్నవి అనే దాని ఆధారముగా ఈ కూర్పు జరిగినది. ఉదాహరణకు "త థ ద ధ న" ఉచ్చరించునపుడు దంతాలు "స్థానము", నాలుక "కరణము" ." ప ఫ బ భ మ"ఉచ్చరించునపుడు పై పెదవి "స్థానము", క్రింది పెదవి "కరణము" . ఇవి ఒక దాన్ని ఒకటి స్పృశించుకొంటాయి. కనుక స్పర్శలు అన్నారు. క, చ, ట, త , ప వర్గలన్నీ స్పర్శలు. అలాగే "యరలవ" లు అంతస్థములు "శ ష స హ" లు ఊష్మలు.

**అనునాసికల పుట్టుక - వాడకంలో వాటి సహజత్వము:**

సూత్రము 1 - ఞ మ ఙ ణ న నాం నాసికాచ : క చ ట త ప వర్గముల చివర వచ్చు ఙ, ఞ, ణ, న, మ లు ముక్కుతో పలుకబడునవి అని ఈ సూత్రము అర్థము.

సుత్రము 2- నాసికా అనుస్వారస్య - పూర్ణ బిందువు లేదా పూర్ణానుస్వారమును ముక్కుతో పలకవలెను.

1. 'గ' ను ముక్కుతో పలికితే 'ఙ' సహజంగా ఉత్పత్తి అవుతుంది.
2. 'జ' ను ముక్కుతో పలికితే 'ఞ' సహజంగా ఉత్పత్తి అవుతుంది.
3. 'డ' ను ముక్కుతో పలికితే 'ణ' సహజంగా ఉత్పత్తి అవుతుంది.
4. 'ద' ను ముక్కుతో పలికితే 'న' సహజంగా ఉత్పత్తి అవుతుంది.
5. 'బ' ను ముక్కుతో పలికితే 'మ' సహజంగా ఉత్పత్తి అవుతుంది.

ఇలాగ వైజ్ఞానికముగా ఏర్పరచడము జరిగినది. అంతే కాక, ఒక వర్గములోని వర్ణానికి ముందు అచ్చుతో కలిసిన అనుస్వారము (పూర్ణబిందువు లేదా సున్న) వస్తే వర్గము చివరి ఉన్న అనునాసికలా అతి సహజంగా పలుకబడుతుంది. క్రింది ఉదాహరణలు మీకోసం-

క వర్గ ఉదాహరణ :- అంకము=అఙ్కము, అంగము = అఙ్గము
చ వర్గ ఉదాహరణ:- రాయంచ=రాయఞ్చ, అంజలి = అఞ్జలి
ట వర్గ ఉదాహరణ :- వంట=వణ్ట, అండము = అణ్డము
త వర్గ ఉదాహరణ :- బొంత=బొన్త , అందము = అన్దము
ప వర్గ ఉదాహరణ :- పంప=పమ్ప, అంబ = అమ్బ

**సంకీర్ణ అక్షరములు - అక్షర మాల విశ్వరూపం:**

భాషా వైవిధ్యము కు ఆలంబన మన సంకీర్ణ అక్షరములు. ఏ అక్షరమును ఉచ్చరించునపుడు, ఒకటికి మించిన శబ్దోత్పత్తి స్థానములను వాడుతామో వాటిని సంకీర్ణ అక్షరములని చెప్పవచ్చు. క్రింది సూత్రములు వివిధ సంకీర్ణ అక్షరములగూర్చి వివరిస్తాయి.

వ కారస్య దంతోష్ఠం : వ కారము ఉచ్చరించాలంటె దంతము పెదవి కలబడును. కనుక దీన్ని దంతోష్ఠమ్ అన్నారు. ఇదే కోవకు చెందినది ఫ్హార్సి లో వాడే 'ఫ్హ' (fa) ఇది ఫ (pha) కు భిన్నమైనది. 'ఫ' ఉచ్చారణలో కేవలము పెదవులు వాడబడాలి, ఫ్హార్సి లో వాడే ' ఫ్హ ' ఉచ్చరించడానికి పై పెదవి క్రింది పళ్ళ వరుస కలిపి వాడాలి. ఉదాహరణ "ఫలము" ను "ఫ్హలము" అని తప్పుగా పలకటము మనకెరుకే.

ఏ ద్వై తోః కంఠ తాలు : ఎ, ఏ, ఐ ఉత్పత్తిలో కంఠము , దవడలు కలిపి ప్రయోగించాలి, కనుక ఇవి సంకీర్ణములు.

ఓ దౌ తోః కంఠ ఓష్ఠం : ఒ ఓ ఔ ఉత్పత్తిలో కంఠము , పెదవులు కలిపి ప్రయోగించాలి, కనుక ఇవి సంకీర్ణములు.

చే జే ల ప్రయోగములో దవడలు, దంతములు కలిపి వాడాలి. ఇవి కేవలము తాలవ్యములైన చ జ లకు భిన్నమైనవి. అందుకే మీరు గమనిస్తే, చే జే ల పైన 'త' వత్తు పెట్టి 'దంతము యొక్క వర్గము-త" లక్షణముతో ఉచ్చరించమని సూచన గా తెలిపారు మేధావులైన మన ప్రాచీన తెలుగు భాషావేత్తలు. వీటిని t, d లకు ఆంగ్ల ఫోనెటిక్స్ లో ఉచ్చరించబడే tcha, dja లకు సమాంతరముగా కూడా ఉపయోగించుకొనవచ్చు. .

ళ ఴ ఱ లు తాలు మూర్ధన్యములు. సరళ, మఱ్ఱి ఇవేకాక తమిళ భాషలో వాడే "ఴ" ను కూడా మనము మన వర్ణమాలలో వ్రాయ వచ్చు, వాడుకొనవచ్చు ఉదాహరణ "పఴమ్" .

ఇదే విధముగా, ఫ్హార్సి లో వాడే ఖ్హ (ఖ్హాన్) ను జిహ్వామూలీయములం కోవలోనిది. అనగా విసర్గ ముందు కల ఖ్హా = ఃఖ+ ఆ . ఇదీ తెలుగులో ఫ్హార్సి ఉరుదూ పద ప్రయోగాల్లో ఖచ్చితత్వానికి వాడవచ్చు.

ఇలా మన అక్షరముల సూత్రములనాధారము చేసుకొని ప్రపంచ భాషలు, ముఖ్యముగా మనము నిత్య జీవితములో వాడే పర భాషా పదాలు, మాండలికాలకు ఆలంబనగా వాడి వాటి మూలాలు కాపాడుకొనవచ్చునని నా పరిశోధనలో తేలిన సత్యము. సంస్కృత భాషా సూత్రాల ఆధారముగా తయారైన ఈ మహా అక్షర లిపి ని నేను విద్యార్థులకు నేరిపించడము జరుగుతోంది. ఈ సంస్కృత శబ్ద శాస్త్రపు సూత్రాలే ఒకప్పుడు IPA వారి ఆలోచనలుద్భవించడానికి మూల కారణం.

**తెలుగు వారి అర్ధ సున్న ప్రత్యేకత:**

తెలుగు వారికి సొంతమైన అర్ధానుస్వరమును/అర సున్నమన పూర్వీకుల భాషా ప్రజ్ఞ కు ఒక నిదర్శనము. పూర్తి సున్న వ్రాసినా వ్రాయకపోయినా అర్థముమారనపుడు అర్ధ సున్నను ప్రయోగించవచ్చు. ఉదాహరణకు "అడగవచ్చు" లేదా "అడంగవచ్చు" రెండూ సరియైనవయినప్పుడు, దాన్ని సూచించడానికి అడఁగవచ్చు అని వ్రాయటము జరుగుతోంది.ప్రాచీన తెలుఁగు భాషా వేత్తల, కవుల భాషా ప్రమాణాల నాణ్యత కు, నిర్దిష్టతకు ఇది ఒక ఉదాహరణ.

**క్ష ద్వారా చెప్పేదేమిటి?**

'అ ' తో మొదలై 'క్ష ' తో సంపూర్ణమయ్యేవి అక్షరాలు. రెంటికి మించిన శబ్దాల సంకీర్ణతే గుణింతము. క్, ష్, అ మూల మాతృకల సమాగమమే క్+ష్+అ=క్ష. "**క్ష**" సూచన ప్రాయంగా అక్షరముల సమాప్తాన్ని మరియు వాటి కలయికకు లేదా గుణింతపు మరియు సంధి ప్రక్రియలకు చెందిన సూత్రాలు తెలిపే ఒక నాందిగా చెప్పవచ్చు. తెలుగు వారు మరిన్ని ఉదాహరణలివ్వాలనే ఉద్దేశ్యముతో **త్ర, జ్ఞ** లను కూడా నేర్పుతారు. ఇక్కడ రెండు అనునాసికల సంకీర్ణత మరియు రేఫ (ర వత్తు) తో సంయోగములను సూచిస్తున్నారు.

**అచ్చులు హల్లులు అనే పదాల పుట్టు పూర్వోత్తరాలు:**

అచ్చు హల్లు అనే పదాలు పాణిని వ్యాకరణ సూత్రములకాధారమైన క్రింది 14 మహేశ్వర సూత్రముల ప్రత్యాహారములనుండి వచ్చాయి.

1. అ ఇ ఉ ణ్
2. ఋ ౡ క్
3. ఏ ఓ ఙ్
4. ఐ ఔ చ్
5. హ య వ ర ట్
6. ల ణ్
7. ఞ మ ఙ ణ న మ్
8. ఝ భ ఞ్
9. ఘ ఢ ధ ష్
10. జ బ గ డ ద శ్
11. ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్
12. క ప య్
13. శ ష స ర్
14. ః ల్

ప్రతి సూత్రము చివరి పొల్లును "ఇత్" అంటారు. దీన్ని కేవలము ఒక "డీలిమిటర్" గా వాడుతారు. ఉదాహరణకు ప్రత్యాహారం "అణ్" అంటే "అ నుండి ణ్" వరకు 'ణ్' మినహాయించి ఉన్న అక్షరములు, అంటే "అ, ఇ, ఉ" లు. ఇపుడు 'అచ్' అంటే చూద్దాం. మొదటి సూత్రము లోని 'అ' తో మొదలై '4 వ సూత్రము లోని చివరి 'చ్' మధ్య గల అక్షరములు, అంటే అచ్చంగా అచ్చులే. అలాగే "హల్" అంటే 5 వ సూత్రము మొదటి అక్షరమునుండి 14 వ సూత్రపు చివరి 'ల్' వరకు గల 'హల్లులు". ఈ అక్షరములను అనేక ఇతర సూత్రాల ఆధారంగా దీర్ఘాక్షరములు, అనునాసికలు, గుణింతాలు, సంధించిన సంయుక్తాక్షరములతో భాషా విశ్వరూపం చూపబడింది. "కంప్యూటర్ సైన్స్ రికార్డ్ డీలిమిటర్" వంటి అనేక అంశాలను, ఈ ప్రత్యాహారాలనుపయోగించి చిన్న చిన్న ఫార్ములే లాంటి భాషా సూత్రాల రూపంలో, నేటి కంప్యూటర్ యుగపు మేధావులు, ముక్కున వేలేసుకొనే విధంగా "పాణిని మహర్షి" , 2500 సంవత్సరములకు పూర్వమే, గొప్ప భాషా శాస్త్రాన్ని తయారు చేసారు. మన ప్రాచీన తెలుగు భాషా వేత్తలు సంస్కృతమునకే సొంతమైన ఈ శబ్ద సూత్రాలను దిగుమతి చేసుకొని ఆ పటిష్టమైన పునాదుల పైన తమ భాషా ఇన్జినీరింగ్ ప్రతిభ తో తెలుగుదనపు అందమైన గొప్ప భవనాన్ని నిర్మించారు. వారికి మనము ఎప్పుడూ ఋణపడి ఉంటాము.

**ఎన్నో భాషల శబ్దాలకాటపట్టైయిన మన తెలుగు అక్షరాల పట్టిక - "మహా త్రిలింగ లిపి/పెను తెనుగు వ్రాలు" :**


| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| **అ** | ఆ | క | ఖ | గ | ఘ | ఙ | | హ | ః |
| ఇ | ఈ | చ | ఛ | జ | ఝ | ఞ | య | శ | |
| | | ౘ | | ౙ | | | | | |
| ఋ | ౠ | ట | ఠ | డ | ఢ | ణ | ర | ష | |
| | | | | | | | ఱ | | |
| | | | | | | | ళ | | |
| | | | | | | | ఴ | | |
| ఌ | ౡ | త | థ | ద | ధ | న | ల | స | |
| ఉ | ఊ | ప | ఫ | బ | భ | మ | | | |
| ఎ | ఏ | | | | | | | | |
| ఐ | | | | | | | | | |

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఒ | ఓ | | | | | | | | |
| ఔ | | | | | | | | | |
| అం | | | | | | | | | |
| అః | | | | | | | | | |
| | | వ | ష్ట | | | | | | |
| | | | ఖ్ట | | | | | | |
| | | | | | | | త్ర | జ్ఞ | క్ష |

పై అక్షరముల పట్టికను "మహా త్రిలింగ/తెనుగు/తెలుగు లిపి" అని గానీ, "దొడ్డ/పెను తెనుగు వ్రాలు" అని గానీ, "తెలుగు కలగలుపు లిపి" అని గానీ , "తెలుగక్షరాల పెద్ద పట్టి" అని గానీ నేను ముద్దు గా పిలిచుకొని, విద్యార్థులకు నేర్పించడము జరుగుతున్నది.
అందరమూ కలిసి మన తెలుగు అక్షర విశ్వరూపాన్ని పదిలంగా కాపాడుకుందాము రండి.





# పాట నేర్చుకుందామా/పాడుకుందామా



**[అమెరికా అమ్మాయి] (1976) సినిమా కోసం [దేవులపల్లి కృష్ణ శాస్త్రి] రచించిన లలితగీతం.**

ప || పాడనా తెనుగు పాట (2) పరవశనై

నే పరవశనై మీ ఎదుట మీ పాట || పాడనా ||

చ || కోవెల గంటల గణగణలో గోదావరి తరగల గలగలలో (2)

మావులు పూవులు మోపులపైన మసలేగాలుల గుసగుసలో

మంచి ముత్యాల పేట, మధురామృతాల తేట, ఒకపాట || పాడనా ||

చ || త్యాగయ, క్షేత్రయ, రామదాసులు (2), తనివితీర వినిపించినది

నాడునాడులా కదిలించేది వాడవాడలా కరిగించేది

చక్కెర మాటల మూట, చిక్కని తేనెల ఊట, ఒక పాట || పాడనా ||

చ || ఒళ్ళంత ఒయ్యారి కోక, కళ్ళకు కాటుక రేఖ (2)

మెళ్ళో తాళి, కాళ్ళకు పారాణి, మెరిసే కుంకుమ బొట్టు

ఘల్లు ఘల్లున కడియాలందెలు అల్లనల్లనా నడయాడే


తెలుగు తల్లి పెట్టని కోట, తెలుగు నాట ప్రతిచోట, ఒక పాట || పాడనా ||

https://www.youtube.com/watch?v=r2yxqDOk18A

❖❖❖❖❖

# దర్శకరత్నతో నా అనుబంధం

కళాబ్రహ్మ, సేవామహాత్మ, శిరోమణి
**డా॥ వంశీ రామరాజు**
హైదరాబాదు




గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సినీ దర్శకులు, మాజీ కేంద్రమంత్రి, మానవతావాది డా॥ దాసరి నారాయణరావుగారితో నా పరిచయం 1975 నుంచి - అంటే సుమారు 45 సంవత్సరాలుగా మా పరిచయానికి సంబంధించిన విషయాలు మీకు చెప్పడానికి ముందు దాసరి నారాయణరావుగారి గురించి కొన్ని విశేషాలు నేను చెప్తాను. అవి మనం తెలుసుకుంటే ఒక మహామనీషి యొక్క ఎదుగుదల మనకు తెలుస్తుంది.

దాసరి నారాయణరావుగారు పాలకొల్లులో 1947 మే 4వ తేదీన జన్మించారు. ఆయన జీవితం వడ్డించిన విస్తరికాదు. ప్రతి అడుగులోనూ అనేక కష్టాలు ఎదుర్కొన్నారు. దాసరిగారు 7వ తరగతిలో ఉండగానే తండ్రిచేసే పొగాకు వ్యాపారం దెబ్బతినడంతో చదువుకునే స్తోమత లేక వడ్రంగి దగ్గర కూలిపనికి చేరారు. అది చూసిన ఆయన క్లాస్ టీచరు ఇతరుల ద్వారా ఆర్థిక సహాయం తీసుకుని స్కూలు ఫీజు కట్టారు. కానీ పుస్తకాలు కొనలేని స్థితిలో దాసరిగారు స్నేహితుల ఇళ్ళకు వెళ్ళి చదువుకున్నారు. ప్రతి క్లాసులో అత్యధిక మార్కులు పొందారు. ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు పొందారు. క్లాస్ లీడర్‌గా, విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనారు.

ఎస్.ఎస్.ఎల్.సి. తరువాత హైదరాబాదు వచ్చి చిన్నచిన్న ఉద్యోగాలు చేశారు. ఆ తరవాత నర్సాపురం కాలేజీలో బి.కాం. పూర్తిచేశారు. హిందీ విశారద పాసైనారు. మరికొన్ని ఉద్యోగాల తరవాత హైదరాబాదు హిందుస్థాన్ ఎరోనాటికల్స్‌లో చీఫ్ సూపరింటెండెంట్‌కి కార్యదర్శిగా పనిచేశారు.

దాసరిగారికి చిన్నతనం నుంచే నాటకాలన్నా, సాహిత్యమన్నా చాలాఇష్టం. 7వ తరగతిలో ఉండగానే 'నేను-నా స్కూలు' అనే 15 నిమిషాల నాటిక రాశారు. 9వ తరగతికి వచ్చేసరికి 45 నిమిషాల నాటిక రాశారు. ఆ నాటిక ఆలిండియా టీచర్స్ కాన్ఫరెన్స్‌లో ప్రదర్శించగా ఉత్తమ రచయితగా, ఉత్తమ ప్రదర్శనగా అవార్డులొచ్చాయి. దాసరిగారు ఇంకా 'పన్నీరు-కన్నీరు', పద్మశ్రీ, యధార్థవాది, ఏప్రిల్‌ఫూల్స్, నలిగిన రోజా, దేశంకోసం నాటకాలు రాశారు. 1960 దశకంలో హృషీకేశ్ పిక్చర్స్ అధినేత వై.వి.కృష్ణయ్య 'అందం కోసం పందెం' చిత్రంలో ప్రధాన హాస్యనటుడి పాత్ర ఇచ్చారు. ఆ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా, ప్రొడక్షన్ మేనేజరుగా కూడా పనిచేశారు. హృషీకేశ్ పిక్చర్స్ మేనేజర్ నారాయణస్వామి దాసరిగారి తపన గుర్తించి ఆయనను రచయితగా స్థిరపడితే బాగుంటుందని సలహాఇచ్చారు. ఆ తరవాత బి.ఎన్. రెడ్డి తీస్తున్న 'రంగుల రాట్నం' సినిమాకు పనిచేస్తున్న రచయిత పాగుమ్మి పద్మరాజు వద్ద సహాయకుడిగా చేరి చిత్రరచనకు కావలసిన మెళకువలు నేర్చుకున్నారు. జరుగుబాటు కోసం టైపిస్టుగా, అకౌంటెంట్‌గా, హిందీ, తెలుగు ట్యూషన్ మాస్టరుగా అనేక ఉద్యోగాలు చేశారు.



గౌరీ ప్రొడక్షన్స్ భావనారాయణగారు 'పానకాలు - పర్వతాలు' చిత్రానికి రచయితగా అవకాశం ఇచ్చారు. ఆ తరవాత జగత్ కిలాడీలు, జగజ్జెట్టీలు, దేవాంతకులు, స్నేహబంధం కథకుడిగా సంభాషణల రచయితగా వ్యవహరించారు. 'మా నాన్న నిర్దోషి' చిత్రానికి తొలిసారి సహకార దర్శకుడిగా పనిచేశారు. తరవాత కొద్దికాలం వేదాంతం రాఘవయ్యగారి దగ్గర సహకార దర్శకుడిగా పనిచేసి తదనంతరం 'తాత - మనవడు' చిత్రానికి తొలిసారిగా దర్శకుడిగా పనిచేయడం, ఆ చిత్రం విజయం సాధించడంతో దర్శకుడిగా చిత్ర పరిశ్రమలో స్థిరపడటం జరిగింది.

1973 నుంచి 2000 వరకు దాసరిగారు 150 చిత్రాలకు దర్శకత్వం వహించారు. 50 చిత్రాల్లో నటించారు. 1978లో తారకప్రభు ఫిలిం సంస్థను స్థాపించి 'జయసుధ' కథానాయికగా 'శివరంజని' చిత్రాన్ని నిర్మించారు.

అంతే కాదు 1983లో 'ఉదయం' దినపత్రికను, ఆ తరవాత శివరంజని, మేఘసందేశం వంటి సినిమా పత్రికలను, బొబ్బిలిపులి లాంటి రాజకీయ పత్రికను కూడా నడిపిన బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి. దాసరి నారాయణరావుగారి దగ్గర సహాయకులుగా పనిచేసిన రవిరాజా పినిశెట్టి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు వంటి అనేకులు తరవాత కాలంలో దర్శకులై ఎంతగా రాణించారో మనందరికీ తెలుసు.

ఆయన దర్శకుడు, రచయిత, నటుడు, పత్రికలకు సంపాదకులే కాదు అనేక సంఘ సేవాకార్యక్రమాలు నిర్వహించారు.

1982లో కాకినాడలో అక్కినేని, ఎన్.టి. రామారావులతో పాటు 60 మంది తారలతో దాసరి నైట్ నిర్వహించి 18 లక్షలు వసూలు చేసి ప్రభుత్వానికి అందించారు. పాలకొల్లులో దాసరి నారాయణరావు 'ప్రభుత్వ మహిళా కళాశాలను' నిర్మించి ప్రభుత్వానికి అప్పగించారు. చలనిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ సంపూర్ణంగా తరలివచ్చి ఆంధ్రప్రదేశ్‌లో స్థిరపడటానికి దాసరి గారు చాలా కృషిచేశారు.

మేఘసందేశం చిత్రం 1983లో కేంద్రప్రభుత్వ ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా రజత కమలం అందుకుంది. ఇదే చిత్రానికి రమేష్ నాయుడికి ఉత్తమ సంగీత దర్శకుడిగా, జేసుదాసుకు ఉత్తమ గాయకుడిగా, పి. సుశీలకు ఉత్తమ గాయనిగా కేంద్ర ప్రభుత్వ జాతీయ అవార్డులు లభించాయి.



1999లో నిర్మించి దర్శకత్వం వహించిన 'కంటే కూతుర్నేకను' చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు, జాతీయ అవార్డు కూడా లభించింది. 1986లో ఆంధ్రా యూనివర్సిటీ వారి గౌరవ డాక్టరేట్, 1991లో రఘుపతి వెంకయ్య అవార్డు,



ఎన్.టి.ఆర్. అవార్డు కూడా పొందారు. 'మామగారు' చిత్రంలో నటించినందుకు ఆయనకు నంది అవార్డు వచ్చింది. ఆ జ్యూరీలో నేనూ ఒక సభ్యుడిగా ఉన్నాను. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో మొత్తం 150 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కారు.

1989లో క్రియాశీల రాజకీయాలలో ప్రవేశించి రాజ్యసభ సభ్యుడుగా కేంద్రమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహించారు.

దీనిని బట్టి మనకు ఏమర్థమవుతుంది. దాసరి నారాయణరావుగారు ఒక సినీ దర్శకుడని మాత్రమే తెలిసిన వారికి ఆయన జీవితం గురించచి తెలిసిన తరవాత ఆయన మీద అభిమానం మనకు మరింత పెరుగుతుంది. నేను విదేశాలకు వెళ్ళినప్పుడు తప్ప చాలా వరకు ప్రతిరోజూ ఆయనను కలిసి టీ/కాఫీ ఆయనతో కలిసి తాగిన క్షణాలు మరిచిపోలేను. దాసరిగారి జన్మదిన వేడుకలు, అమ్మ రాజీనామా, కంటే కూతుర్నేకను, మేఘసందేశం మరెన్నో చిత్రాలకు సంబంధించిన విజయవంతమైన కార్యక్రమాలను, 150 మంది దర్శకులకు, 100 మంది నిర్మాతలకు సత్కార కార్యక్రమాలను, ఎన్నెన్నో ఆయనకు సంబంధించిన సభలు, సమావేశాలు చేయడమే కాక సుమారు 75 వంశీ బర్కిలీ అవార్డ్స్ ఆయనకు బహూకరించాము.

మే 4వ తేదీ ఆయన జన్మదినమైతే 3వ తేదీ అర్ధరాత్రి 12 గంటలకు ఆయన ఇంటికి వెళ్ళి కేక్ కట్ చేసిన తరవాత నేనే ముందుగా ఎరుపురంగు పట్టు శాలువా కప్పేవాణ్ణి. ఆయన జన్మదినోత్సవం నాడు 5 లక్షల రూపాయలు పేద విద్యార్థినీ విద్యార్థులకు, పేద కళాకారులకు ఆర్థిక సాయంచేసేవారు. ఎవరు ఆయన ఇంటికి వచ్చినా, ఎంత పేదవారైనా టీ తాగ కుండా వెళ్ళేవారు కాదు, భోజనం చేయకుండా వెళ్ళేవారు కాదు, చలన చిత్ర పరిశ్రమలో కానీ, రాజకీయాలలో కానీ ఎవరికే సమస్య వచ్చినా ఆయనను కలిసేవారు. అన్నిటి కంటే విచిత్రమేమిటంటే ప్రతి జనవరి 1వ తేదీన ఆయన దగ్గరకు వచ్చిన వారందరికీ కొత్త 100 రూపాయల నోటు ఇచ్చేవారు. ఆయన చేతుల మీదుగా 100 రూపాయల తీసుకోవడానికి ప్రఖ్యాతిగాంచిన నటీనటుల నుంచి చిన్న టెక్నీషియన్స్ వరకు వచ్చేవారు. నాకైతే రెండు ఇచ్చేవాడు. ఒకటి నాకు రెండవది మా ఆవిడకు. ఇప్పటికి అవి మా ఇంట్లో దాచిపెట్టుకున్నాం.

'ఉదయం' పేపరు పెట్టినప్పుడు 'నువ్వు నాతోనే ఉండాలి' అని లీవ్ పెట్టించారు. నేనెంతో చిన్నవాడినైనా నాతో అనేక విషయాలు పంచుకునేవారు. ఒకసారి ఆయనను ఎవరో సత్కరించి 50 వేల రూపాయలు బహూకరిస్తే అది తీసుకొని నేరుగా నేను నడుపుతున్న దివ్యాంగుల ఆశ్రమానికి వచ్చి ఇచ్చివెళ్ళారు. దివ్యాంగుల ఆశ్రమానికి స్వంత భూమి కొనాలనుకున్నప్పుడు రామోజీ ఫిలిమ్ సిటీకి వెళ్ళేదారిలో కొనమని సలహాఇచ్చారు. ఆ కొన్న స్థలంలోనే వంశీ-వేగేశ్న ఆశ్రమాన్ని నిర్మించాను. నన్ను బాగా ప్రోత్సహించేవారు. 'మా అందరికీ అవార్డు ఇచ్చి సత్కారాలు చేసి ఎంతో సహకరించావు. నీకు మేమందరం ఎప్పటికైనా ఘనసత్కారం చేయాలి'






అనేవారు. 2017లో నేను అమెరికా వెళ్ళేముందు 2017 మే 3వ తేదీ అర్ధరాత్రి ఆయన కేక్ కట్‌చేసిన దృశ్యం నేను మరిచిపోలేను. అప్పటికి ఆయన అనారోగ్యంగా ఉండి కిమ్స్ ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చారు. అదే చివరి జన్మదినం అవుతుందని నేను ఊహించలేదు. దాసరిగారు నటించి దర్శకత్వం వహి,చిన సూరిగాడు చిత్రంలో నాతో ఒక పాత్ర వేయించారు. ఆ చిత్రానికి జాతీయ అవార్డు కూడా వచ్చింది. అలాగే నాన్నగారు, ఎర్రబస్సు, మేస్త్రి తదితర చిత్రాల్లో సరదాగా ఆయనను కలవడానికి వెళ్ళినప్పుడు నాకో పాత్ర ఇచ్చి ప్రోత్సహించారు.

ఎన్నో సంవత్సరాలు దాసరిగారి పేరు మీద ఫిలిమ్ జర్నలిస్టులకు 'దాసరి-వంశీ బెస్ట్ ఫిలిమ్' జర్నలిస్టు అవార్డు ఇవ్వడం జరిగింది. అంతే కాకుండా నూతన దర్శకులకు కూడా దాసరి పేరు మీద అవార్డు ఇచ్చి సత్కరించడం జరిగింది. ఎన్.టి.ఆర్. స్వర్ణకంకణం దాసరిగారికి బహూకరించడమైంది.

దివ్యాంగుల ఆశ్రమ సహాయార్థం నేను తరచు అమెరికా వెళ్తుంటాను. 2017లో ఆయనను కలిసి ఇలా వెళు తున్నానని చెప్పినప్పుడు, 'ఈసారి వెళ్ళక పోతే ఏమవుతుంది? సెప్టెంబరులో వెళ్ళు' అన్నారు. ఆర్థికంగా దివ్యాంగుల ఆశ్రమం నడపడం కష్టంగా ఉంది. వెళ్ళక తప్పదు 'అన్నాను', జీవితమంతా త్యాగాలకే సరిపోతోంది. నీకూ 70






ఏళ్ళురాబోతున్నాయి. 50 సంవత్సరాలనుంచి సాంస్కృతిక, సాహిత్య సేవాకార్యక్రమాలలో ప్రభుత్వ ఉద్యోగం కూడా మానేసి నిస్వార్థసేవ చేస్తున్నావు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. సరే వెళ్ళిరా' అంటూ కౌగిలించుకున్నారు. అదే చివరి కౌగిలింత అనుకోలేదు. సరిగ్గా మే నెల 30, 2017 రోజున ఆయన పరమపదించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ లాంఛనాలతో ఆయన అంతిమయాత్రను నిర్వహించింది. అప్పుడు నేను అమెరికాలో ఉన్నాను. ఇప్పటికీ నాకు ఆయన 'లేరు' అనే ఊహరాదు, ఎందుకంటే అంత తొందరగా పోవలసిన వారు కాదు - ఆయన పోయిన తరవాత తెలుగు సినిమా పరిశ్రమలో ఏ కష్టమొచ్చినా దాసరిగారుంటే ఇలా జరిగేది కాదు కదా! అని అనుకుంటూ ఉన్నారు. అందుకే ఆయనకు మరణం లేదు. ప్రతి సంవత్సరం వంశీ సంస్థ ఆయన జన్మదినం చేస్తూ ఆయన్ను స్మరిస్తోంది. మనకు మిగిలేది స్మరణేమరి.



ఆయన పద్మశ్రీ కోసం, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కోసం ఎంతో ప్రయత్నం జరిగింది. వరల్డ్ రికార్డ్ డైరెక్టర్‌కు ఆ రెండూ రాలేదు.

# ప్రేమలెన్నో!

- డా॥ తెన్నేటి సుధాదేవి
హైదరాబాదు

శంకర్ ఉదయం నుంచి సుష్మకు ఫోన్ చేస్తూనే ఉన్నాడు. ఆమె ఫోన్ తియ్యలేదు.

కొంతసేపటి తరవాత మేసేజ్ పెట్టాడు.

సమాధానం లేదు.

మళ్ళీ ఫోన్ చేశాడు - స్విచ్ ఆఫ్

శంకర్‌కి కోపం వస్తోంది.

టెన్షన్ పెరిగిపోతోంది. ఏం జరుగుతోంది? నాలుగు రోజుల్నుంచి ఫోన్ తియ్యడం లేదు - కలవడంలేదు - తమ ఐదేళ్ళ ప్రేమకు ఫుల్‌స్టాప్ పెట్టిందా? తను ఆమెను ఆరాధించాడు - ఆమె తన బతుకు అనుకుంటున్నాడు. హఠాత్తుగా ఏమైంది?

టి.వి. న్యూస్ చానల్లో దృశ్యం చూసి ఒళ్ళుగగుర్పొడిచింది. తనను ప్రేమించలేదని ఒక అమ్మాయిని నడి రోడ్డుమీద పెట్రోలు పోసి తగలబెడ్తున్నాడు, ఒక ప్రియుడు. ఉలిక్కిపడ్డాడు శంకర్.

తనకు సుష్మ అంటే చాలాఇష్టం. ఇద్దరి కులాలు వేరువేరు. ఇద్దరూ అనుకున్నారు. తమ ప్రేమకు కులం అడ్డుకారాదని, వాట్సప్‌లు, మెసేజ్‌లు, రెస్టారెంట్‌లో కూల్‌డ్రింకులు, టీలు అన్నీషేర్ చేసుకున్నారు. ఇంకా చదువు పూర్తికాలేదు. పెద్దవాళ్ళ సపోర్ట్ లేకపోతే జీవితం ఎల్లా గడుస్తుందని ఆలోచన.

సుష్మ తల్లితండ్రులు ఈ ప్రేమ వ్యవహారాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కట్టడి చేశారు. సుష్మ ముఖ్యంగా తండ్రిని ఒప్పించాలని ప్రయత్నం చేసింది.

ఈ మధ్య ముభావంగా ఉంటున్న సుష్మను 'ఎందుకట్లా ఉన్నావంటూ' ప్రశ్నిస్తూనే ఉన్నాడు శంకర్. సుష్మ మౌనంగా ఉండిపోయింది. శంకర్ మనసు కీడు శంకించింది. సుష్మలో ఏదో మార్పు - ఎందుకు? చదువు మీద మనసు నిలవడం లేదు శంకర్‌కి - బి.టెక్. ఫైనల్ పరీక్షలు దగ్గరపడుతున్నా చదవలేక పోతున్నది. సుష్మలో ఈ మార్పుకు కారణమేమిటో తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాడు శంకర్. ఫోన్ స్విచ్చాఫ్.

వాళ్ళ ఇంటి దగ్గరకు వెళ్ళాడు. సుష్మ అన్న తీవ్రంగా చూశాడు శంకర్‌ని. 'ఎందుకు వచ్చావు?' అన్నాడు. 'సుష్మతో మాట్లాడాలి' 'నీకు దాంతో మాటలేమిటి? గెటౌట్'' అంటూ దగ్గరకు వచ్చి శంకర్‌ని ఒక్కతోపు తోశాడు. శంకర్‌కి మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. లోపల్నుంచి సుష్మవాళ్ళమ్మ బయటికి వచ్చింది. 'ఏందిరా - మా ఇంటి ముందట ఈ పంచాయితీ - నర్సింహా పోలీసులకు ఫోన్ చెయ్యరా' అని అరవడం మొదలుపెట్టింది.

శంకర్ మౌనంగా అక్కణ్నుంచి వచ్చేశాడు - మనసును కత్తితో కోస్తున్నట్లుంది. తనకెవరూ లేరు - ఒంటరివాడు. అమ్మా, నాన్న తన మాట వినరు - తననే కోప్పడతారు.

బస్కెక్కాడు, రైల్వే స్టేషన్ దగ్గర దిగాడు. ఫ్లాట్ ఫారమ్ మీద నడుస్తున్నాడు.

కళ్ళలోంచి నీళ్ళు కారిపోతున్నాయి. సుష్మ తనను మోసంచేసింది. ఇంక తను రైలుకింద పడి చచ్చిపోవాలి - బతకడం అనవసరం.. ఆలోచిస్తూ నడుస్తున్నాడు. ప్లాట్‌ఫారమ్ ప్రయాణీకులతో కిటకిటలాడుతున్నది. వచ్చేపోయే రైళ్ళను చూస్తూ ఒక నిమిషం నిలబడి పోయాడు. ఏ రైలుకి ఎదురు పోవాలి? గుండెలు దడదడలాడుతుంటే అటూ ఇటూ చూస్తున్నాడు.

శంకర్ నిలుచున్న చోట బెంచీ మీద ఇద్దరు దంపతులు కూర్చుని ఉన్నారు. వాళ్ళ మాటలు ఒక నిమిషం నిశ్చేష్టుడై వింటుండిపోయాడు. వాళ్ళ 15 ఏళ్ళ అమ్మాయిని ఎవరో కిడ్నాప్ చేశారు. పోలీస్ కంప్లెయింట్ చేశారు. 3 రోజులైనా జాడ తెలియలేదు. 'ఆ పిల్ల మీద ప్రాణం పెట్టుకుని బతుకుతున్నాం' - మంజు ఎక్కడున్నదో - ఎట్లా ఉన్నదో... నాకు బతకాలని లేదు. వెక్కివెక్కి ఏడుస్తున్న భార్యను ఓదారుస్తున్నాడు భర్త - కానీ అతనూ ఏడుస్తున్నాడు. ఒక్కగానొక్క పిల్ల - టెన్త్ చదువుతోంది - స్కూలుకి వెళ్ళిన పిల్ల తిరిగిరాలేదని ఆ సంభాషణలో అర్థమైంది శంకర్‌కి.

కూతురు కోసం ఆ తల్లీతండ్రీ పడుతున్న బాధ చూసి ఉలిక్కిపడ్డాడు శంకర్. అతని ఆవేశం, మీద నీళ్ళు చిలకరించినట్లైంది. పిల్లల కోసం తల్లితండ్రులు పడే బాధ చూస్తుంటే శంకర్ ఆలోచనలో తేడావచ్చింది. అవును తన భవిష్యత్తు ముగిసిపోతుంది. అమ్మ, నాన్నలకు కడుపుకోత మిగులుతుంది. అమ్మకు తనంటే చాలాఇష్టం. ఇంటికి రావడం ఆలస్యమైతే ఎదురు చూస్తూనే ఉంటుంది. ఫోన్లు చేస్తుంది, తను బతికేలేడనుకుంటే అమ్మ, నాన్న ఏమైపోతారు - ఎదురుగా ఉన్న దంపతులు ఏడుస్తూనే ఉన్నారు. వాళ్ళల్లో అమ్మా, నాన్న కనిపిస్తున్నారు. వాళ్ళు కనబడకపోతే, వాళ్ళ మాటలు వినకపోతే ఈపాటికి రైలుకింద తను తునాతునకలుగా... శంకర్ తన తొందరపాటుకు, వెంటనే తీసుకున్న నిర్ణయానికి మనసు చిందరవందరగా ఉంది. స్టేషన్ బయటకు వచ్చాడు. సుష్మ గురించి ఆలోచించడం మానేసి చదువు కోవాలి. అనుకుంటూ నడుస్తూంటే సెల్‌ఫోన్ మోగింది - అమ్మ ఫోన్ చేసింది.

'శంకర్ ఎక్కడున్నావు నాన్నా?... 'అని

'ఫ్రెండ్ దగ్గరకు వెళ్ళానమ్మా!' వచ్చేస్తున్నాను. ఒక్క అరగంటలో ఇంట్లో ఉంటాను. ఆకలేస్తోందమ్మా! అన్నాడు. నీకిష్టమైన వంకాయకూర, మజ్జిగ పులుసు చేశాను.

'సరేనమ్మా' అని ఫోన్ పెట్టేశాడు శంకర్

మనసు తేలిగ్గా ఉంది.

ప్రేమంటే ప్రేమికుల మధ్య ప్రేమే కాదు - అమ్మ ప్రేమ, నాన్న ప్రేమ, స్నేహితుల ప్రేమ - ఎన్నో విలువైన ప్రేమలున్నాయ్ - అని ఆలోచిస్తూనే ఇంట్లో అడుగుపెట్టి అమ్మను ప్రేమగా కౌగిలించుకున్నాడు.



ఆప్యాయంగా తలనిమిరిన అమ్మను, 'వచ్చావా' అన్నట్లు చిరునవ్వుతో చూసిన నాన్నను చూస్తూ గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు శంకర్.

# సంగీత నాదామృతం

-డాక్టర్ పద్మ మల్లెల, సిడ్నీ



అయితే మంగళ హారతి సంగీతం కానప్పుడు మరి పూజలో గీతం శ్రావయామి అని ఎందుకు పెట్టారు అనే సందేహం కలగవచ్చు. మొదటి కారణం వేదాంగాలలో ఒకటయిన గాంధర్వ వేదం సంగీతం. ఇది కాకుండా పూజలో భాగం అయితే దాని ఉపయోగం కొంత అయినా మానవులు అనుభవించాలనే ఉద్దేశ్యం కావచ్చు. మన ఆర్యులు అంటే పెద్దవాళ్ళు పూజ అనేది ఒక నియమ బద్ధమయిన జీవన విధానాన్ని అలవాటు చేసుకోవటానికి నిర్దేశించి, దానిలో చక్కని యోగ సాధన కలిగిన సంగీతాన్ని ఉదహరించటంద్వారా సంగీత సాధన యొక్క ఔన్నత్యాన్ని అందరూ గుర్తించాలని,తద్వారా చక్కని ఆయురారోగ్యాలు పెంపొందించుకోవాలని అనుకోవచ్చు. దానిద్వారా దైవదత్తమయిన ఆ విద్య మీద కొంతమందికయినా దాని లోతులు తెలుసుకోవాలనే జిజ్ఞాస కలగవచ్చు అనే ఉద్దేశ్యమూ అయుండచ్చు.

ఇక ఇప్పుడు ఇన్నాళ్ళూ మనం ముచ్చటించుకుంటున్నట్టు పాటగా సంగీతాన్ని కొంత పక్కన పెట్టి అసలు సంగీత శాస్త్రం ఎలా అభివృద్ధి చెందింది, అందులోన శాస్త్ర కారులను గురించి కొంత తెలుసుకుందాం. సదాశివుడు సంగీతానికి మూలమని ఇంతకు ముందు సంచికలలో చెప్పుకున్నాం. తరువాత బ్రహ్మ, ఆంజనేయ తదితర దేవతలందరూ సంగీతానందాన్ని అనుభవించి మానవులకు అందించారు. మరి మనకు ఉదహరించ బడిన పెక్కు గ్రంథాలలో మొదట నారదుడు రచించిన 'స్వరార్ణవం' మరియు 'నారదోపాస్తి'. ఈ రెండు గ్రంథాలు త్యాగరాజ స్వామికి నారదుడి నుంచి లభ్య మయ్యాయని ఆర్యోక్తి. అయితే ఈ నారదుడు స్వర్గలోకపు నారదుడు ఒకరు కాదని ఈ నారదుడు వేరే ఋషి అని కొందరి అభిప్రాయం. ఇటువంటి సంగీతశాస్త్ర గ్రంథాలలో తరువాతది మతంగుడు రచించిన 'బృహద్దేశి" అనే గ్రంథం. దానిని గురించి వేరొక సారి ప్రస్తావించుకుందాం. సంగీత ప్రపంచంలో శాస్త్రవేత్తలను రెండురకాలుగా చెప్పుకోవచ్చు. ఒకటి సంగీత శాస్త్రకారులు మరియు వాగ్గేయ కారులు అనగా musicologists and composers. ఈ సంగీత శాస్త్రకారుల రచనల వలన వాగ్గేయకారులు ఉద్భవించారని ఇక్కడ మనం చెప్పుకోవచ్చు. ఇలాంటి సంగీత కారుల కోవలోకి చెందిన వారే భరతుడు ఇత్యాదులు. కనుక ఇప్పుడు మనం 13 వ శతాబ్దికి

చెందిన శార్ఙ్గదేవుడు అనే సంగీత శాస్త్రకారుని గురించి తెలుసుకుందాం. ఈయన సంగీత రత్నాకరము అనే సంగీత లక్షణ గ్రంధాన్ని మరియు అధ్యాత్మ వివేకము అనే వేదాంత గ్రంథాలను రచించారు. ఈయన కాశ్మీరీయుడు. ఈయన తాతగారగు భాస్కరుడు దక్షిణ దేశమునకు వలస వచ్చెను. ఈయన తండ్రి గారగు సోఢలదేవుడు దేవగిరి (today's Daulathabad) పాలించిన సింఘణదేవుని ఆస్థానమున పనిచేశను. శార్ఙ్గదేవుడు 'నిశ్శంక' అనే వీణను రూపొందించెను. అంతే కాక రెండు తాళ రీతులను ఏర్పరచెను. మనం ఇంతకుముందు సంచికలలో చదివిన సంగీత పరమయిన శ్లోకములన్నీ ఈయన రచించిన సంగీత రత్నాకరములో చెప్పబడినటువంటివే.

ఈ గ్రంధములో 7 అధ్యాయములున్నవి. అవి వరుసగా స్వరాధ్యాయము, రాగాధ్యాయము, ప్రకీర్ణాధ్యాయము, ప్రబంధాధ్యాయము, తాళాధ్యాయము, వాద్యాధ్యాయము మరియు నృత్యాధ్యాయము. ఈ అధ్యాయములు తిరిగి ప్రకరణములుగా విభజింప బడినవి. ఈయన తరువాత సంగీత శాస్త్రవేత్తలలో ముఖ్యులు సింహ భూపాలుడు కల్లినాధుడు మొదలయిన వారు. వీరు సంగీత రత్నాకరమునకు భాష్యములు అనగా వివరణ రాశారు.
మనం ముందు సంచికలలో ప్రస్తావించుకున్న స్వర వివరణ , స్థాయి వివరణ వంటి విశేషములు ఈ గ్రంధమునుండి తీసుకొని వేరే పుస్తకాలలో పొందుపరచబడినవే.

ఇంతకు ముందు పేర్కొనబడిన త్యాగరాజ కీర్తన 'మోక్షము గలదా' లోని చరణంలో

" ప్రాణానల సంయోగము వలన
ప్రణవ నాదము సప్త స్వరములై బరగ"

అనే వాక్యాలకు స్ఫూర్తి ఈ గ్రంధములోని సంగీత వివరణ అనే చెప్పవచ్చు. దీనికి సంబంధించిన శ్లోకం:

' నకారం ప్రాణ నామానాం దకారమనలంవిదుః
జాతః ప్రాణాగ్ని సంయోగా త్తే ననాదో ఽభిదీయతే'

ఇక ఈ సంచికలో సంగీత జ్ఞానము భక్తి వినా అనే త్యాగరాజ కీర్తనలోని విశేషాలను చర్చించుకుందాం. ఈ కీర్తన పల్లవిలో

'సంగీత జ్ఞానము భక్తి వినా
సన్మార్గముకలదే మనసా"

అనగా భక్తితో కూడిన సంగీత జ్ఞానమును మించిన మోక్ష సాధన మార్గము ఇతరము లేదని చెప్పబడింది.

'భృంగి నటేశ సమీరజ ఘటజ
మతంగనారదాదులుపా సించే' సంగీత జ్ఞానము

అనే వరుసలలో మనం పై న చర్చించుకున్న సంగీత లక్షణ కారుల చర్చ కనపడుతుంది. ఇక చరణంలో ఈ ప్రపంచమంతా మాయా మయమని దానిని జయించే సులభమయిన మార్గం సంగీతమని పేర్కొనబడింది.

ఇంతే కాక స్వర రాగ సుధారస అనే శంకరాభరణ రాగ కీర్తనలో మూడవ చరణంలో పైన చెప్పబడిన నారదముని యొక్క స్వరార్ణవ గ్రంధ ప్రస్తావన కనపడుతుంది. ఆ చరణం ఎలా సాగుతుందంటే

‘ రజత గిరీశుడు నగజ కు దెల్పు స్వరార్ణవ మర్మములు’

అని సాగుతుంది. కనుక ఈ సంగీత విద్యలోని మర్మములు తెలుకుని అందరూ ఆ రసాన్ని ఆస్వాదిస్తారని ఆశిస్తూ......

https://www.youtube.com/watch?v=yQXiNjUxr7O.

❖❖❖❖❖






❖❖❖❖❖






❖❖❖❖❖

# జులపాల కథ

శ్రీ వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్

అవి నేను కొత్తగా అమెరికా వచ్చిన రోజులు లేదా అమెరికా వచ్చిన కొత్త రోజులు. వచ్చిన మొదట్లో రోడ్డు మీద పెద్ద పెద్ద కార్లు నా గుండెల్లో రైళ్ళు పరిగెత్తేవి. మా అమ్మ దగ్గర్నించి కనీసం వారానికో ఉత్తరం వచ్చేది. అక్కడి విశేషాలు ఏమిటి. వివరాలన్నీ రాయి. ఆవటా అని. ఉద్యోగం, సద్యోగం లేక అడ్డగాడిదలాగ, రోడ్డు మీద పడి తిరుగుతున్న నాకు పెద్ద మంచి విశేషాలేమున్నాయి, రాయడానికి? ఉన్న సంగతులు అంటే అమ్మాయిలు బావుండటం, ఎవరికి కనపడకుండా అదోరకమైన సినిమాలు చూడడం వగైరాలు అమ్మకి, బాబుకి రాయడానికి లేదు కదా! అంచేత ఉత్తరంలో పేజీ నింపడానికని, 'కళ్యాణం' గురించి రాశాను.

అదే లెండి. ఇక్కడికి రాక ముందు నుంచీ మా అమ్మ "ఏమిట్రా పెధవా, ఆ చెంపల దాకా జుట్టూ, నువ్వూనూ. బైరాగి వెధవలాగా" అంటూ తిడుతూ ఉండేది,. ఇంకా రెండు మూడు నెలల్లో అమెరికా వెళుతున్నా కదా, అక్కడ అందరూ ఇలాగే ఉంటారు, జులపాలు లేకపోతే వెనక్కి పంపేస్తారు కాబోసు అని కష్టపడి జుట్టు పెంచి 'యాయా' అంటూ మాట్లాడ్డం నేర్చుకొన్నాను కదా. అదీ సంగతి, అందుకే ఆ ఆవిడ తిట్లు! తీరా ఈ దేశానికి వద్దును గదా, జనం అంతా మామూలుగానే ఉన్నారు. వెతికి చూస్తేనే గాని పెద్ద జుట్టు వాళ్ళు కనబడలేదు.

ఇక అమెరికా వచ్చి ఎన్నాళ్ళయినా ఉద్యోగం రావటం లేదని, నేను వాపోతుంటే, శివరాం గాడు "ఒరేయ్, ఆ వెధవ జుట్టేసుకొని ఇంటర్వ్యూకి వెడితే హ్యూస్టన్లో ఉద్యోగం ఎవడిస్తాడూ? వెళ్ళి కాస్త క్షవరం చేయించుకునిరా. మరీ మిలట్రీవాడు లాగా కాకుండా, కొంచెం కెన్నెడీలా చేయించుకో" అని హితబోధ చేశాడు.

సరే... ఉద్యోగానికి ఈ ట్రిక్కు కూడా చేసి చూద్దాం, అని ఓ రోజు మంగలి షాపు వెతుకుదామని వచ్చీరాని, డ్రయివింగు చేస్తూ రోడ్డు మీద బయల్దేరాను. దాని దుంప తెగ.. "ఇచ్చట అందముగా క్షవరము చేయబడును, ప్రొ. వీర్రాజు" లాటి బోర్డులు" ఎంత వెతికినా కనబడవు.
అసలు అమెరికాలో మంగలి షాపులు పైనుండి చూడ్డానికి ఎలా ఉంటాయోనని బయల్దేరేటప్పుడు శివరాంగాడ్ని అడగనయినా లేదు, ఇప్పుడు ఎలాగరా అనుకుంటూ వెళుతుండగా, ఒకచోట Hair Shaft అన్న బోర్డు కనబడింది. "ఆహా, వాడి కొట్టు పేరులో Hair అని ఉంది కదా, బార్బరు షాపు సంగతి తెలియకపోతుందా, అడిగి చూద్దాం' అని ఆగాను. బయట నుంచి అంతా గ్లాస్, దాని లోపల కర్టెన్లు, తలుపెక్కడో కనపడి చావదు. సరే, ఇలా ఉందా అని, ఆ గాజు ఒక పక్క నుంచి మొదలు

పెట్టి, తోసి, లాగి, నానా విధాలుగా, తంటాలు పడ్డాను. మొత్తానికి ఒకచోట తలుపు తెరుచుకుంది. లోపలికి వెళ్ళాను. అంతా చీకటిమయం. ఏమీ కనబడి చావదు. కళ్ళు నులుముకుంటే చీకట్లో చూడడం అలవాటు అవుతుందని అనుకుంటుండగా ఎక్కడ్నించో ఒక చక్కటి ఆడగొంతు "May I help you" అన్నట్లు వినబడినది. జాగ్రత్తగా, దీక్షగా పట్టి చూస్తే, ఎదురుగుండానే, ఓ పెద్ద; బల్ల, ఆ బల్ల వెనకాల కృష్ణదేవరాయలు సింహాసనం లాంటి కుర్చీ, అందులో ఓ చక్కటి తెల్లటి పిల్ల వరసగా కనపడ్డాయి.

ఆ పిల్ల నందివర్ధనం పువ్వులా ఉంది చూడ్డానికి, వాసనకి కూడాను. అట్టే బట్టలు కూడా వేసుకున్నట్లు లేదు. ఇదేదో తప్పు చోటుకి వచ్చేము కాబోసు అని వెనక్కి తిరగబోతుంటే, ఆ పిల్ల మళ్ళీ కోకిల్లాగా కూసింది "ఏమన్నా సాయం కావాలా" అని.

“సరే, ఇలాగ నాకు జుట్టు బాగా పెరిగింది, క్షవరం చేయించుకుందామని తిరుగుతున్నాను” అని కథ చెప్పబోయాను.

“ఇప్పుడే కావాలా, తరువాతా” అంది ఆ పిల్ల. క్షవరం రేపు కావలసి వస్తే ఇవాళెందుకు వస్తానోయ్ వెర్రి మొహమా అనుకొని ఆ మాటే కాస్త మర్యాదగా చెప్పాను. ఆ పిల్ల ఏవేవో కాయితాలు, తిరగేసి, ఒక కంప్యూటర్తో కాబోసు మాట్లాడి, “ఒక అరగంట కూచుంటావా ఏర్పాటు చేస్తాను” అంది. అప్పటికి చీకట్లో చూడడం అలవాటయి, ఆ పిల్ల వాటం చాలా బావుండటం గమనించి సరే సౌందర్య వీక్షణ చేస్తూ కూర్చోవచ్చుగదా, మొత్తానికి మంగలి షాపు పట్టేశాం అనుకుని సరే అన్నాను.

“సార్, మీ పేరు, ఎడ్రస్, టెలిఫోను నెంబరు ఏమిటి?” అంది నందివర్ధనం.

ఏవన్నా డేట్ అడుగుతుందేమో అనుకుని ఆశగా, గొంతుక తడి ఆరిపోగా అన్నీ చెప్పాను.

“ఇక్కడ సంతకం పెట్టు” అని ఒక కాగితం ముక్క ఇచ్చింది.

జుట్టు కత్తిరించడానికి ఈ సంతకం గట్రా ఎందుకు, ఆస్తి రాయించుకుంటోందా? ఏమోనని జాగ్రత్తగా చదివాను.

క్షవరం చేసినప్పుడు, నా బుర్రకి, మరే అవయవాలకు గాని దెబ్బలు తగిలినా, కోసుకున్నా నేను వాళ్ళ మీద దావా వెయ్యను అని ఆ కాగితం ముక్క సారాంశం.

'ఖర్మరా' అని సంతకం చేసి సోఫాలో చతికిలబడ్డాను. ఏవో పుస్తకాలు చూద్దామనుకుంటే అంతా చెత్త. ఫ్యాషన్ మీద, ఎలాంటి హైరాయిల్ వాడాలి, ఏ విగ్గు పెట్టుకోవాలి అనే పుస్తకాలు తప్పితే మంచివి లేవు. అదే ఇండియాలో అయితే 'అభిసారిక', 'మదన” వగైరా పుస్తకాలుండేవి. ప్రొ. వీర్రాజు వచ్చి భుజం కుది పేదాకా టైము తెలిసేది కాదు.

కాసేపు నందివర్ధనం కేసి, కాసేపు పుస్తకాల్లోకి చూస్తుండగా, ఎక్కడనుంచో హఠాత్తుగా వాడెవడో ఊడిపడి చెయ్యి ముందుకు చాపి, "I am Bob, your barber, are you ready" అన్నాడు.

వాడు చూడ్డానికి హాలీ వుడ్ వాళ్ళలా తెల్ల నవ్వు నవ్వుతున్న యస్వీరంగా రావులా ఉన్నాడు. వాడి పేరుకీ, వృత్తికీ rhyme బాగానే కుదిరిందనుకుంటూ రెడీయేలేవోయ్ అని వాడి వెనకాలే బయలు దేరాను. అలాగ, ఇలాగ తిప్పి మొత్తానికి ఓ గదిలోకి తీసుకొని వెళ్ళాడు. అక్కడ ఒక కుళాయి, అంటే సింక్ అన్నమాట. దాని ముందు మరో భోజరాజు సింహాసనం లాంటి కుర్చీ చూపించి కూచో బెట్టాడు. ఈ అఖండ గౌరవానికి ఆనందిస్తుండగా, వాడు, మెడ దగ్గర ఏదో మీట నొక్కాడు. రపీమని, మన కాళ్ళు గాల్లోకి, తలకాయ సింకులోకి వెళ్ళిపోయాయి. మనకి మాట పెగిలేలోపుగా నెత్తి మీద వేడినీళ్ళు, వాడి వేళ్ళు కలిసి, నా క్రాపింగ్ చెడగొట్టేశాయి.

ఓహోహో! వీడు మనకి మంగళస్నానాలు చేయిస్తున్నాడు కాబోసు, అని ఈ కళ్యాణ సమయంలో జరగబోయే అసలు పెళ్లి గురించి ఆలోచిస్తూండగా బాబు (Bob)గాడు జుట్టంతా తుడిచేసి, మళ్ళా నన్ను నిలువునా కూచోబెట్టాడు.

మళ్ళీ పది నిముషాలు, ఆ మయ సభలో నడిపించి మరో కుర్చీలో కూచోబెట్టి, "ఎలా చెయ్యమన్నావు?" అన్నాడు.

వాడు మాట్లాడుతున్న టెక్సాస్ భాష నాకు అర్థం కాక, నేను మాట్లాడిన తెలుగు ఇంగ్లీషు వాడికి అర్థం కాక వాడు చూపించిన దొరల బొమ్మలలో ఏదో బొమ్మ చూపించి అలా తగలెయ్యి అన్నాను. వాడో అరగంట సేపు సకల యంత్రాలతో తంటాలుపడి, నా జులపాలు తగ్గించి, నన్ను మళ్ళీ మర్యాదస్తులలో పడేసాడు. నెత్తి మీద బరువు దించిన ఫీలింగుతో మళ్ళీ నందివర్ధనం దగ్గరికి వెళ్ళాను.

నన్ను చూసి కంప్యూటర్లోంచి ఒక కాగితం లాగి, "కేష్ ఆర్ ఛార్జ్" అంది.

ఆ రెండవ పనికి స్తోమత లేక..అంటే అప్పటికి మనకి ఇంకా ఒక్క క్రెడిట్ కార్డు కూడా లేదు కావున "కేష్ నోచ్" అన్నాను. "20 డాలర్లు సర్" అంది. "అమ్మ బాబోయ్, 160 రూపాయలే!' అనిపించగానే నందివర్ధనం పర్వతవర్ధిని లాగ కనపడింది. చేసేదేమి లేక, ముడుపు సమర్పించుకుని తిట్టుకుంటూ బయటపడ్డాను.

మరింక రాయడానికి విశేషాలు ఏమీ లేక, మా అమ్మకి, ఈ విశేషాలన్ని వ్రాశాను.

వెంఠనే 'కేబుల్' వచ్చింది. "మన ప్రొ. వీర్రాజు ఇంటికి వచ్చి రూపాయకే నెల నెలా చేస్తాడు. ఆ దేశం మనకెందుకు, వెంఠనే ఇండియా వచ్చేయ్"అని.

(ఇది నేను వ్రాసిన మొట్ట మొదటి కథ. రచనా కాలం 1977 - రచయిత)

❖❖❖❖❖

# ఇల్లే కదా నరకం! స్వర్గం!!

శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్

' మళ్ళీ వుత్తిచేతుల్తో అఘోరించారా? పొద్దున్న ఆఫీసుకెళ్తున్నప్పుడు చిలక్కి చెప్పినట్టు చెప్పాను. బియ్యం నిండుకున్నాయి, వచ్చేటప్పుడు తీసుకు రండీ, అని. మతిమరుపు మహాలింగం. మళ్ళీ తిండికి తిమ్మరాజులా వేళకి డైనింగ్ టేబులు దగ్గిరకి హాజరవుతారు. అనుభవించండి. ఈ పూటకి మీకు జొన్నరొట్టెలే గతి.'

' నోరు మూస్తావా? ఎప్పుడూ మొగుడు మీద ఎగిరిపడడమే గాని నువ్వు వెలగబెట్టేదేమిటి? నేనిలా ఆఫీసుకెళ్ళగానే టి.వి.లో వంటలు, మహిళలు మహారాణులు, సీరియల్సు చూసుకుంటూ వైభవం వెలగబెట్టడమేగా? ఇంకా ఇంట్లోకి అడుగు పెట్టలేదు, అప్పుడే దండకం మొదలెట్టావు.'

' బియ్యం తేకుండా వచ్చి, మళ్ళీ ఎదురు నా మీదకి దండయాత్ర చేస్తారా? మీరు ఆఫీసులో ఏడ్చి చచ్చేదేముంటుంది? వెళ్ళగానే హాయిగా ఫేనేసుకుని కునుకు తియ్యడమేగా? మళ్ళీ రెండు కొట్టగానే గుటుక్కు గుటుక్కు మంటూ టిఫిను బాక్సు ఖాళీ చెయ్యడం. ఛీ ఛీ, మీతో కాపరం కన్నా గాడిద కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకోవడం పుణ్యం.'

' ఔనౌను, నీ చేతి దరిద్రపు కూడు తినడం కన్నా రోడ్డు పక్కన కూర్చుని ఎంగిలాకులు ఏరుకోవడం నయం.'

************************

మహాప్రభో! ఇంక వాళ్ళ భాగవతం మనం వినలేం. అనవసరంగా వాళ్ళ ఇంట్లోకి నేను తొంగి చూడడమే కాక, మిమ్మల్ని కూడా తీసుకెళ్ళాను. ఇప్పుడు చెవులు డెట్టాలు తోను, ఫినాయిలు తోను కడుక్కోవాలి కామోసు. ఏమనుకోకండి. దీనికి ప్రాయశ్చిత్తంగా ఇప్పుడు మిమ్మల్ని మరో ఇంటికి తీసికెళ్తాను. రండి, రండి.

మళ్ళీ అదే దృశ్యం! భర్తగారు ఆఫీసుకెళ్తూంటే, భార్య గారు గుర్తు చేసింది, ' ఏమండీ, బియ్యం ఇంట్లో పూర్తిగా నిండుకున్నాయి. మీరు వచ్చేటప్పుడు మర్చిపోకుండా బియ్యం తీసుకురండి. అల్లాగే ఏమన్నా కూరలు కూడా తెస్తే మంచిది.'

' చిత్తం గృహలక్ష్మిగారూ! మీ ఆజ్ఞ శిరోధార్యం.'

' బాగానే వుంది సంబడం. రోడ్డు మీదకంటా వచ్చేసి ఏమిటా మాటలు? ఎవరన్నా వింటే ఏమనుకుంటారు? నేనేదో గయ్యాళిననీ, మీరు పరమ భార్యావిధేయులనీ ప్రపంచమంతా ప్రచారమై పోదూ?'

' అనుకుంటే అనుకోనీ. మహాకవి జయదేవుడు పద్మావతీ చరణ చారణ చక్రవర్తిట. అల్లాగే నేనూ వాసంతీ చరణ చారణ చక్రవర్తిని.'

' ఇంక ఆపండి పతిదేవా, ఇంక చాలు. మీకు ఆఫీసుకి టైమవుతోంది. ఇంక బయలుదేరండి.'

' చిత్తం.'

**********************

ఇది పొద్దున్న జరిగిన దృశ్యం. మొదట మనం ఇంటికెళ్ళిన జంట పేరు కాళింది, కనకరాజు. ఇప్పుడు చూసిన జంట పేరు వాసంతి, రాజారావు. కనకరాజు బియ్యం తేకుండా తగలడ్డట్టే, రాజారావు కూడా బియ్యం తేకుండా అఘోరించాడు. ఇప్పుడు రాజారావు ఇంటికెళ్ళగానే అక్కడ ఏ మూడో మహా ప్రపంచ యుద్ధం జరుగుతుందో గమనిద్దాం రండి. కంగారు పడకండి, వాళ్ళిద్దరూ మరీ ఘోరమైన పదజాలాన్ని వాడుతుంటే వెంటనే పరిగెట్టుకు వచ్చేద్దాం లెండి.

రాజారావు కూడా కనకరాజు లాగే ఆఫీసులో వాళ్ళ ఆఫీసరు చేత నానా చీవాట్లూ తిన్నాడు. మనసంతా గజేంద్రుడు ఇష్టం వచ్చినట్లు పాడు చేసిన కొలనులా అల్లకల్లోలమై పోయింది. ' హు, గృహలక్ష్ములకి ఈ బాధ వుండదు కదా. హాయిగా మహారాణుల్లా ఇంటో వైభవం వెలగబెడతారు! ' అని అక్కసుగా కనకరాజు అనుకుంటే, రాజారావు మాత్రం ఒక జీవం లేని నవ్వొకటి నవ్వుకుని ' It's O.K. It does happen at times.' అనుకుంటూ, సమాధాన పడుతూ ఇంటి దారి పట్టాడు. కనకరాజు లాగే వికలమనస్కుడై వుండడం వల్ల బియ్యం సంగతి మర్చిపోయాడు.

ఇంటికెళ్ళే సరికి,

వాసంతి కడిగిన మంచి ముత్యంలా చక్కగా తెల్లచీర కట్టుకుని, ముస్తాబై చిరునవ్వుతో ఎదురొచ్చింది. రాజారావు అలసటగా కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకుని పొద్దున్న తిన్న తిట్లు గంగిగోవులా నెమరేసుకుంటున్నాడు. మల్లెపూల వాసన గుప్పున నాసికాపుటాలకి సోకేసరికి కళ్ళు తెరిచాడు. వాసంతి ఫ్రిజ్ లోంచి చల్లటి నీళ్ళు కాసిని గ్లాసులో ఒంపి, మరికాసిని మామూలు నీళ్ళు కలిపి, నీళ్ళు మరీ చల్లగా లేకుండా చూసి రాజారావుకిచ్చింది. రాజారావు ఆత్రంగా గ్లాసు తీసుకుని గడగడా తాగేసాడు. చల్లటి నీళ్ళు కొద్ది కొద్దిగా గొంతులోంచి లోపలికి జారుతోంటే ప్రాణం లేచొచ్చింది. అప్పుడు గుర్తుకు వచ్చింది, వాసంతి పొద్దున్న చెప్పిన విషయం. కంగారుగా కుర్చీలోంచి లేచాడు.

' వాసంతీ! నువ్వు నన్ను క్షమించాలోయ్! నువ్వు బియ్యం తెమ్మన్న సంగతి మర్చిపోయి,దేభ్యంలా ఇంటికి వచ్చేసాను. ఉండు, ఇప్పుడే బజారుకెళ్ళి బియ్యం, కూరలు తెస్తాను. ఇంకా ఏమేం కావాలో చెప్పు, అవి కూడా తెచ్చేస్తాను.'

' తమరు ప్రశాంతంగా కూర్చోండి పతిదేవా! ఇప్పుడేమంత కొంప మునిగిపోయిందని? కాఫీ వేడి చేస్తున్నాను. ముందు కాఫీ తాగుదురు గాని. ఆఫీసులో ఏ పని వత్తిడి వల్లో మర్చిపోయుంటారు. ఈ మాత్రం దానికి సారీ ఎందుకు?'

రాజారావుకి పూలకారులో, యమునాతటిపై, మాధవుని వేణుగానం వింటూ, మలయానిల స్పర్శను పొందుతున్నంత హాయి కలిగి మనసులో గ్లాని, శరీరానికి కలిగిన అలసట ఒక్క క్షణంలొ తొలగిపోయాయి. భార్య కన్నుల్లోకి ప్రేమగా చూస్తూ గ్లాసుతో ఆమె తెచ్చిన వెచ్చని అనురాగాన్ని ఆత్రంగా జుర్రుకోసాగాడు.

కాఫీ తాగేసి, గ్లాసు సింక్ లో పడెయ్యడానికి వెళ్ళబోతుంటే వాసంతి చటుక్కున అతడి చేతిలోంచి గ్లాసు తీసుకుంది, ' మీరుండండి. గ్లాసు నేను సింక్ లో పడేసి వస్తాను' అంటూ.

రాజారావు ఆమె వెనకాలే వెడుతూ, రాయంచలా అడుగులేస్తున్న ఆమె చరణసోయగాన్ని నేత్రాలతోనే ఆస్వాదిస్తూ అన్నాడు, ' వాసంతీ! పోనీ, ఒక పని చేద్దామోయ్! ఇంక ఇవాళ నువ్వు వంట కార్యక్రమాన్ని అత్యవసరపరిస్థితి ప్రకటించి రద్దు చేసెయ్. మనిద్దరం హాయిగా కబుర్లు చెప్పుకుంటూ బజారుకెడదాం. నేను బియ్యం, కూరలు కొంటాను. అక్కడినించి ఫ్యాన్సీషాపుకెడదాం. అక్కడ నువ్వు, నా చొక్కాకి అంటించడానికి కాటుక, బుగ్గకి అంటించడానికి లిప్ స్టిక్ కొనుక్కుందూ

గాని.' అంటూంటే వాసంతి కళ్ళతోనే అతడిని మందలించి, బుగ్గ గిల్లింది.

రాజారావు ఆగలేదు, ' భార్య భర్తని మనసారా, బిగియారా కౌగలించుకుంటుంది. అందులో తప్పేముంటుందోయ్? అప్పుడు కాస్త మొగుడి చొక్కాకి కాటుక అంటుకుంటుంది. అందులో అపసవ్యమేముంటుందోయ్? ఏరియల్! టట్టడాయ్! మొండి మరకల్ని కూడా పోగొడుతుంది! అప్పుడు నేను, ప్లీజ్, ప్లీజ్, వాసంతీ! ఒక్కటి, ఒక్కటంటే ఒక్కటి, పోనీ, నీకు సిగ్గుగా వుంటే నేను కళ్ళు మూసుకుంటానులే అంటూంటే, నువ్వే నా రెండు కళ్ళూ మూసేసి, అధరాభిసారం చేస్తావుట! అప్పుడు, ఏయ్! సెన్సారువాళ్ళూ! భార్యాభర్తల జీవితాల్లోకి తొంగిచూడడానికి మీకూ, మీ కత్తెరలకూ సిగ్గులేదూ? అని నేను కేకలేస్తూంటే, అప్పుడు నువ్వు మళ్ళీ నా బుగ్గ గిల్లి, నేను నెప్పి పుట్టి, అమ్మో అని అరుస్తే, ఇప్పుడు మీ అమ్మగారెందుకండీ, ఆలీ అని అరవక..... ? అంటూ మళ్ళీ నా కందిపోయిన బుగ్గమీద నీ పెదాలతో మంత్రం వేస్తే, అప్పుడు ఆ పెదాలమీద నీ లిప్ స్టిక్ ముద్ర పడితే, నా వాసంతి సామి రాజా! అప్పుడుంటుందీ, అది శృంగారానికి పరాకాష్ట కాదూ? అప్పుడు నేను మాత్రం మరో గీతగోవిందం గీకలేకపోదునా?'

వాసంతి ఈ సారి నిజంగానే అతడి వాచాలతకి కళ్ళెం వెయ్యడానికి అతడి పెదవులని తన పెదాలతో మూసేసింది.

ఇద్దరూ పదినిముషాల్లో ఇంటికి తాళం వేసి బైట పడ్డారు. ఒకళ్ళ చేతిలో మరొకళ్ళు చెయ్యి వేసుకుని, స్వీట్ నథింగులు మాట్లాడుకుంటూ బజారుకి వెళ్ళారు. అక్కడ కొనవలసినవి కొనుక్కుని, పక్కనే వున్న హోటలుకి వెళ్ళి, తియ్యటి కబుర్లు చెప్పుకుంటూ, తింటూ, సర్వరు సప్లై చేసిన పదార్థాలని ఆ కబుర్లలోకి నంచుకుని, ఆటోలో ఇంటికి చేరుకున్నారు.

************************

కనకరాజుకి పెళ్ళాం దండకం వింటూంటే ఆవేశం ఆగలేదు. చేతికి దొరికిన టి.వి.రిమోట్ తీసుకుని ఆమె నెత్తిన ఒక్క దెబ్బ వెయ్యబోయాడు.

కాళింది గట్టిగా అరిచింది, ' కొడతావా? కొట్టరా మొగుడూ. నీకు చేతనైంది అదేగా? బైటికెడితే పిల్లిలా అందరికీ అణిగిమణిగి వుండడం, ఇంట్లోకొస్తే మృగరాజులా, జంతువులా మారిపోయి పెళ్ళాం మీద చెయ్యి చేసుకోవడం. మీ మగాళ్ళందరికీ చేతనయింది ఇదేగా? కొట్టు, చంపెయ్. పీడ వదిలిపోతుంది.'

కనకరాజు ఆ రిమోట్ తో ఒక్క దెబ్బ తన నెత్తిమీద కొట్టుకున్నాడు. తల బొప్పి కట్టింది. రిమోట్ పగిలిపోయింది. ' ఛీ, ఛీ! ఏ జన్మలోనో నేను చేసుకున్న పాపం, నువ్వు నాకు పెళ్ళాం లాగ దాపురించావు.' అంటూ తరచుగా తను వెళ్ళే బార్ కేసి నడిచాడు.

కాళింది మొగుడ్ని నోటికొచ్చిన తిట్లన్నీ తిట్టుకుంటూ, రిమోట్ కి ప్లేస్టిక్ టేపుతో బ్యాండేజి చుట్టి, ' ఛీ టి.వి.' ఛానెల్లో ' ఏందిరో, నా మొగడా?' అనే సీరియల్ యొక్క మూడువేల నాలుగు వందల నలభై ఆరో భాగం చూడసాగింది. అందులో మొగుడూ పెళ్ళాలకి అసలు పడటల్లేదు. కొన్ని వేల భాగాలనించీ కొట్టుకు చస్తున్నారు. ఇంక లాభం లేదని, పెళ్ళాం మొగుడికి విషం ఇచ్చి చంపేద్దామని నిశ్చయించుకుంటుంది. మొగుడు కూడా విచిత్రంగా అప్పుడే పెళ్ళానికి విషం ఇచ్చి చంపేద్దామని నిశ్చయించుకుంటాడు. మొగుడు ఆఫీసు నించి ఇంటికి వస్తాడు. పెళ్ళాం లోపల కాఫీలో విషం కలిపి తీసుకు వచ్చి టేబులు మీద పెడ్తుంది. ఇంకో కాఫీకప్పు తను తెచ్చుకుంటుంది. ప్రేమగా మొగుడ్ని కాఫీ తాగమని చెబుతూ ఆ విషం కలిపిన కాఫీ కప్పు వాడి చేతికి ఇస్తుంది. మొగుడుకి అనుమానం వస్తుంది. ఏమిటి, ఎప్పుడూ లేనిది, ఇవాళ పెళ్ళాం

తనమీద ఇంత ప్రేమ ఒలకబోస్తోంది? ఇందులో ఏదో మతలబు వుందని, పెళ్ళాం ఎదురుగా వుండగానే, మ్యూజిక్ బద్దలైపోతుండగా గట్టిగా స్వగతంలో అనేసుకుంటూ, పెళ్ళాం మీద ఎప్పుడూ లేనంత ప్రేమని ఒంపేస్తూ, తలనెప్పిగా వుందని, టాబ్లెట్ వేసుకోవాలని, కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టమనీ అడుగుతాడు. పెళ్ళాం లోపలికి వెళ్ళగానే, ఆవిడ కాఫీకప్పులో విషం కలిపేస్తాడు. ఇప్పుడు ఇద్దరి కాఫీకప్పుల్లోనూ విషం వుంది. ఇవాళ తరవాతి భాగం నడుస్తోంది. పెళ్ళాం ఆ విషం కలిపిన కాఫీ తాగుతుందా? లేక పెళ్ళాం తనకి విషం కలిపి ఇచ్చిన కాఫీని మొగుడు తాగేస్తాడా? లేక ఆ విషం కలిపిన కాఫీలు ఇద్దరూ తెలీకుండా తాగేస్తారా? ఏమవుతుంది?............ఏమవుతుంది?

సీరియల్ మధ్యలో చిన్న బ్రేక్ వస్తే, కాళింది లోపలికి వెళ్ళి వంటింట్లో నాలుగు అరటిపళ్ళు వుంటే, రెండు వలుచుకుని తిని, కాస్త మజ్జిగ తాగి, హడావిడిగా బాత్ రూముకి వెళ్ళి వచ్చి, మళ్ళీ సీరియల్ చూడడంలో మునిగిపోయింది. ఆ సీరియల్ అవగానే, చిన్నపిల్లలు చేసే బూతు డ్యాన్సుల ప్రోగ్రాం, ' కసి కసి కసి ' చూస్తూ వుండిపోయింది. దాని తర్వాత ఛీ ఛానెల్లో ఆడవాళ్ళు మగవాళ్ళ వేషాలు వేసి, థూ ఛానెల్లో మగవాళ్ళు ఆడవాళ్ళ వేషాలు వేసి, ద్వంద్వార్ధాలతో వున్న, పిచ్చి వాగుళ్ళు వాగుతూ చేసే వెకిలి చేష్టల కార్యక్రమాలు ' మస్త్ మస్త్ ' ' ఖుషీ ఖుషీ ' మార్చి మార్చి చూడసాగింది. కనకరాజు చిత్తుగా తాగేసి వచ్చి ఏమీ తినకుండా అలాగే పడకగదిలోకి వెళ్ళి బట్టలన్నా మార్చుకోకుండా పడుకుండి పోయాడు.

*****************************

ఆటోలో ఇంటికి వచ్చిన వాసంతి, రాజారావులకి ఎప్పటిలాగే ఆ రోజు కూడా తొలిరాత్రే అయింది.

**************************

ఆ రోజు ఆదివారం. కనకరాజుకి మామూలురోజుల కన్నా ఆరోజు చాలా పనులు వుంటాయి. హడావిడిగా లేచి గంటలో తయారైపోయి, పెళ్ళాం పెట్టిన మాడిపోయిన మినపరొట్టె బలవంతంగా మింగి బయలుదేర బోయాడు.

' మామూలు రోజుల్లో ఎటూ తప్పదు. కనీసం ఆదివారం నాడన్నా ఇంట్లో పడి ఏడుద్దామని వుండదు ఈ మగాడికి. ఛీ, ఛీ, ఎప్పుడూ ఆ లత్తుకోరు స్నేహాలూ, బలాదూరు తిరుగుళ్ళూనే. గమ్మున తగలడండి.' అంటూ కనకరాజు బైటకెళ్ళగానే భళ్ళున తలుపు వేసుకుని స్నానానికి పెరట్లోకి వెళ్ళింది కాళింది.

ప్రతిఆదివారం కనకరాజు, అతడి జులాయి మిత్రులు అందరూ పొద్దునే పేకాట మొదలెడతారు. సాయంత్రం దాకా కసితీరేలా పేకాడేస్తారు. ఆటకింతని డబ్బులు తీసి పక్కన పెడతారు. సాయంత్రం అయ్యేసరికి దాదాపు వెయ్యి రూపాయలు పోగవుతుంది. ఆ డబ్బుతో అందరూ బారుకి పోయి రాత్రి పదిన్నర దాకా జల్సా చేసుకుని అప్పుడు ఎవరిళ్ళకి వాళ్ళు వెళ్ళి పెళ్ళాలు తిట్టే తిట్లు ఈ చెవితో వింటూ, ఆ చెవితో వదిలేస్తూ మంచాలమీదకి చేరుకుని గుర్రు పెట్టి నిద్దర్లు పోతారు.

యధావిధిగా పదకొండింటికి ఇంటికి చేరుకున్నాడు కనకరాజు. వస్తూనే తలుపులు దబదబ బాదేసాడు. తలుపులు తీస్తూనే తిట్ల పురాణం లంకించుకుంది కాళింది. ' ఛీ ఛీ, ఇటువంటి మగాడికి పెళ్ళాం కావడం కన్న, ఊరకుక్కకి ఒకపూట తిండి కావడం నయం. వారానికి ఏడురోజులూ ఇంట్లోనే పడి ఏడుస్తూనే వుంటుందే, కనీసం ఆదివారం నాడన్నా పెళ్ళాన్ని ఏ సినిమాకో తీసికెడదాం అన్న ఇంగిత జ్ఞానం కూడా వుండదు ఈ కర్కోటకుడికి. తనేమిటో, తన సరదాలేమిటో. అంతే తప్ప పెళ్ళాం పిచ్చిది ఏం చావు చస్తోందో అన్న ధ్యాస కూడా వుండదు.'

కనకరాజు తాగినప్పుడు పెళ్ళాం ముందు పిల్లిలా అయిపోతాడు. ఆవిడ ఎన్ని తిట్టినా తనని కాదన్నట్లు, దులుపుకుని, మాట్లాడకుండా మంచం ఎక్కేసి దుప్పటి ముసుగు తన్నేసాడు.

******************************

రాజారావు ఇంట్లో కూడా ఆరోజు ఆదివారమే. అంతకు ముందురోజు రాత్రి ఆలస్యంగా పడుకున్నందు వల్లనో ఏమో, వాసంతికి గమ్మున మెలకువ రాలేదు. పైగా ఒళ్ళంతా పచ్చిపెప్పులుగా వుంది. లేద్దాం, లేద్దాం అనుకుంటూనే మగతగా పడుకుండిపోయింది. ఎవరో వచ్చి, మెల్లిగా తట్టిలేపుతున్నట్లుంటే కొద్ది కొద్దిగా కళ్ళు తెరిచి చూసింది వాసంతి. ఎదురుగా పతిదేవులు చిరునవ్వుతో 'శుభోదయం వసంతమా!' అంటూ నుదురు మీద ముద్దు పెట్టుకున్నాడు. దిగ్గున లేవబోయింది వాసంతి. ' అబ్బబ్బ, నెమ్మది, నెమ్మది. ఇవాళ ఆదివారం. నువ్వంత అర్జంటుగా లేచి చెయ్యవలసిన రాచకార్యాలేమీ లేవులే. నెమ్మదిగా లేచి మొహం కడుక్కో.' అంటూ చెయ్యి అందించాడు. వాసంతి సిగ్గు పడుతూ బాత్ రూమ్ లోకి వెళ్ళింది. మొహం కడుక్కుంటోందన్న మాటే గాని, ' ఛి, ఛి, ఇవాళ చాలా ఆలస్యం అయిపోయింది. అంతా ఆయన మూలానే. పెందరాడే పడుకోనిస్తేనా?' అని మనసులోనే విసుక్కుంటూ, ఇవాళేం టిఫిను చేయాలబ్బా? అని ఆలోచించసాగింది. పెసరపప్పు రాత్రే నానబోసింది కనక పెసరట్లు వేసి, ఉప్మా చేస్తే ఆయన సంతోషంగా తింటారు అనుకుంటూ గబగబా స్నానం ముగించుకుని, దేవుడి దగ్గరకెళ్ళి దీపం వెలిగించి దణ్ణం పెట్టుకుని వంటింట్లోకెళ్ళింది. అక్కడ తను పెసరపప్పు నానబోసిన గిన్నె ఖాళీగా కనిపించింది. ఇదేమిటి, ఈ గిన్నెలో కాదా నానబోస్తా అనుకుంటూ గిన్నెలు వెతుకుతూంటే వెనకాలనించి రాజారావు పెసరట్టు, ఉప్మా వున్న ప్లేటు ఆమె కళ్ళముందు పెట్టాడు. వాసంతి తెల్లబోయింది.

' ఏమిటండీ, ఈ ఆడంగి పనులు? అసలే లేవడం లేటయిందని నేను సిగ్గుపడుతూంటే, ఇంకా బాధ పడేలా ఏమిటి మీరు చేసిన పని?' అంది కోపంగా.

' ఏముంది? రోజూ నువ్వు నాకు అడ్డమైన చాకిరీ చేస్తున్నావు. ఇవాళ ఆదివారం కదా, నీకు కొంచెం రిలీఫ్ నేను ఇస్తే ఎల్లా వుంటుంది అనిపించింది. అందుకే నువ్వు చెయ్యాలనుకున్న పెసరట్టు, ఉప్మా నేనే చేసేసాను. దా, ఆకలేస్తోంది. ఇద్దరం కలిసి తినేద్దాం.' అన్నాడు రాజారావు.

వాసంతికి ఏమనాలో తోచలేదు. మనసులో చాలా పశ్చాత్తాప పడుతూంటే, రాజారావు ఒక పెసరట్టు ముక్క తుంపి, ఉప్మాలో నంచి ఆమె నోట్లో కుక్కాడు. ' అబ్బ, ఎంత రుచిగా వండారండీ! నేను కూడా మీ ముందు బలాదూర్! ' అంది.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ టిఫిన్లు తినడం పూర్తి చేసి కాఫీలు తాగారు.

వాసంతి, ' ఏమండీ, ఇవాళ ఆదివారం కదా, ఏం చేద్దామంటారు?' అని అడిగింది.

ఇద్దరూ టి.వి. ఎక్కువగా చూడరు. అందులో వచ్చే తెలుగు సీరియల్సు, సినిమాలు అంటే వాళ్ళకి ఇష్టం వుండదు. విపరీతమైన హింస, ఆడవాళ్ళు క్రూరంగా ప్రవర్తించడం, చిన్నపిల్లలను దిండుతో నొక్కి ఊపిరాడకుండా చేసి చంపడానికి ప్రయత్నించడం లాంటి కథావస్తువులతో వుండే తెలుగు సీరియల్సంటే ఇద్దరికీ పరమ అసహ్యం. ఇక సినిమాల జోలికొస్తే, సంభాషణలు పలకడం చేతకాని, నటనంటే ఏమిటో తెలియని, పగలు చూస్తే రాత్రి కల్లోకొచ్చే వికారంగా వుండే శాల్తీలు, అది తమ వంశపారంపర్యపు హక్కు అన్నట్లుగా హీరోలుగా చలామణీ అయిపోతుండడం, ఇక తెలుగు రాని ఇతర రాష్ట్రాల పిల్లలు ఒంటిమీద సరిగ్గా బట్టలు లేకుండా, పైజమాలో గండుచీమలు దూరాయేమో అన్నట్లు అష్టవంకరలు తిరిగిపోతూ, హోరు

సంగీతానికి కుప్పిగంతులెయ్యడం, ఒక హీరో వందమందిని అవలీలగా చితక్కొట్టడం - ఇలాంటి అంశాలతో వున్న సినిమాలంటే వాళ్ళకి అస్సలు పడదు. అందుకని ఆదివారాలు వాళ్ళకిష్టమైన పద్ధతిలో గడిపేస్తూ వుంటారు.

రాజారావు అన్నాడు, ' ఇద్దరం హాయిగా కూర్చుని కేరంబోర్డు ఆడదాం. ఎవరు ఓడిపోతే వాళ్ళు ఈ పూట వంట చెయ్యాలి.'

వాసంతి నవ్వేసి అంది, ' అమ్మో! ఈ పప్పులు నా దగ్గిరేం ఉడకవు. మీరు కావాలని ఓడిపోయి చేతులు కాల్చుకోడానికి తయారవుతారు. చూడండి, వంటిల్లు నా సామ్రాజ్యం. అందులోకి ఎవ్వరూ, ఆఖరికి స్వంత మొగుడైనా సరే, జొరబడ్డానికి నేను ఒప్పుకోను గాక ఒప్పుకోను.'

' ఐతే సరేలే. వంట నువ్వే చేద్దూగాని. ఈలోపున నేను బట్టలన్నీ వాషింగ్ మెషీన్లో వేసేసి ఆరేస్తాను. తరవాత ఇల్లు సర్దేస్తాను. అప్పుడు ఇద్దరం కలిసి భోంచేసి హాయిగా కాసేపు కునుకు తీద్దాం. తరవాత సాయంత్రం కాసేపు పార్కులో తిరిగి వద్దాం. ఏమంటావ్?' అన్నాడు.

వాసంతి ఆ మాటలకి ఒప్పుకుంది. ఆమె బియ్యం కడుగుతూంటే, రాజారావు అరటికాయలు ముందేసుకుని తరగడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో అతడి మిత్రుడు నరసింహం వచ్చాడు. కూర తరుగుతున్న రాజారావుని చూసి నిర్ఘాంతపోయి అన్నాడు, ' ఒరేయ్ రాజారావ్! ఏమిట్రా ఇది? నువ్వు...........నువ్వు కూర తరుగుతున్నావా?'

వాసంతి సిగ్గుపడిపోతూ, ' నేను అక్కడికీ చెబుతూనే వుంటాను అన్నయ్యగారూ. ఆయనకదో సరదా. నా మాట వినరు.' అంది దోషిలా.

రాజారావు అన్నాడు, ' రారా నరసింహ్. కూర్చో. ఏమిటీ విశేషాలు. ఏమే, ఇంక ఈ అరటికాయలు నువ్వే తరుక్కో. ఈ లోపున నాకూ వీడికీ కాస్త కాఫీ తీసుకురా.'

నరసింహ కూర్చుంటూ మళ్ళీ అన్నాడు, ' అది కాదురా రాజా, నువ్వు కూరలు తరగడం.........ఇదేం సరదారా?'

రాజారావు అన్నాడు, ' ఒరేయ్ నరసింహ్! మన రాజ్యాంగంలో గాని, మనుధర్మశాస్త్రంలో గాని కూరలు తరుగుట, అన్నము వండుట ఆడువారే చెయ్యవలెను, మగవారు చెయ్యరాదు అని ఏమన్నా రాసివుందేమిటిరా? మొగుడూ, పెళ్ళాలన్నాక కాస్త ఒకరికొకరు చేదోడు వాదోడుగా వుండకూడదా? పొద్దుట్నించీ, రాత్రి పడుకునేదాకా యంత్రంలా ఆడది అన్నిపనులూ తనే చెయ్యాలా?'

' అని కాదనుకో. కాని మనం కష్టపడి బైటికెళ్ళి నాలుగు రాళ్ళు సంపాదించి ఇంట్లో ఇవ్వటల్లేదూ? మన డ్యూటీలు మనకుంటాయి.'

' ఏడిశావులే. మనం ఆఫీసుల్లో అంత దారుణంగా ఏమీ కష్టపడిపోవటల్లేదు. ఆడవాళ్ళ శ్రమతో పోలిస్తే మనం పడే శ్రమ నథింగ్. ఐనా ఈ రోజుల్లో ఆడవాళ్ళు కూడా బైటికెళ్ళి సంపాదించుకొస్తున్నారుగా? ఐనప్పటికీ ఇంటిపని, వంటపని చచ్చినట్లు వాళ్ళే చేస్తున్నారుగా?'

నరసింహ అన్నాడు, ' అది నిజమేననుకో. కాని..........'

' నీ కానీలు తీసి అవతల పడెయ్యి. కానీ, అర్ధణాల రోజులు ఎప్పుడో వెళిపోయాయి. A wife and husband are two complementary halves of a unit. వాళ్ళు ఇద్దరూ సమానమే. ఒకరికి ఒకరు పరిపూరకాలు. అంటే ఒకరి అభిరుచులని రెండవ వారు గౌరవిస్తూ, ఒకరి లోటుపాట్లను రెండవవారు కమ్ముకుంటూ, కలిసిమెలిసి ఆనందంగా హాయిగా జీవితాలు గడపాలిరా. అంతేగాని, ఒకరు ఎక్కువ అని, వేరొకరు తక్కువ అనే భావనలో వుంటూ, ఎదుటివారిని గౌరవించకుండా, కించపరుస్తూ ప్రవర్తిస్తే దాని వల్ల సంసారంలో పొరపొచ్చాలు చెలరేగి, సంసారజీవితం ఒడిదుడుకల మయమై పోతుందిరా. ఇది గ్రహించకనే ఎందరో తమ సంసారజీవితాల్లో నిప్పులు పోసుకుంటున్నారు. రెండు అరటికాయలు తరిగితే నా కండలు కరిగిపోతాయా? ఆ మాత్రం సాయం నేను నా పెళ్ళానికి చేసుకోకూడదా?'

నరసింహానికి సిగ్గేసింది. రాజారావు అన్నది నిజమేగా? తను ఎంత సంకుచితంగా ఆలోచించాడు? అనిపించింది. ఇంకేం మాట్లాడలేక పోయాడు. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి వెళిపోయాడు.

వాసంతికి తన భర్తని చూస్తే చాలా ముచ్చటేసింది. మేరా భారత్ మహాన్. మేరా భర్తా భీ మహాన్!' అనుకుంటూ బియ్యం పొయ్యిమీద పడెయ్యడానికి వెళ్ళింది.

***************************

కాళిందికి కనకరాజుకి ఒక్క క్షణం పడటల్లేదు. నిప్పు, ఉప్పులా వుంది పరిస్థితి.

ఒకసారి కనకరాజు స్నేహితుడు శర్మ అన్నాడు, ' ఒరేయ్ కనకరాజూ! ఇల్లా రోజూ మీరిద్దరూ దొమ్ములాడుకుంటూంటే, ఇంక జీవితంలో మీకు సుఖమేముంటుందిరా? కొంచెం నువ్వే తగ్గచ్చుగా? రోజూ ఆ వెధవ పేకాటలు, తాగుళ్ళు మానేసి నీ పెళ్ళాంతోనే కాలం గడపచ్చుగా?'

కనకరాజు విషాదంగా అన్నాడు, ' నీకు తెలీదురా. నా భార్య ఏ విషయంలోనూ రాజీ పడదు. ఎప్పుడూ తనదే పైచెయ్యిగా వుండాలనుకుంటుంది. భార్యతో సరదాగా గడపాలని నాకు మాత్రం వుండదా? ఒరేయి శర్మా, భోజ్యేషు మాతా, శయనేషు రంభా అన్నారు కదా? ఏరోజూ నేను ఇంట్లో సుఖంగా నాలుగు మెతుకులు తిన్నది లేదురా. కూరలో ఉప్పుంటే కారం వుండదు, కారముంటే ఉప్పుండదు. అన్నం ఉడికీ ఉడక్క ఏడుస్తుంది. ఇదేమిటి అని అడిగాననుకో, ఇంక కురుక్షేత్ర సంగ్రామమే. ఇంక పైశ్లోకంలో రెండవ చరణం అంటావా, ఆ విషయం నేను మాట్లాడకపోవడమే మంచిది. భార్య సరిగ్గా వుంటే భర్త రోడ్డెందుకు ఎక్కుతాడురా?'

శర్మ ఆ మాటలు విని ఇంకేం అనలేకపోయాడు.

సరిగ్గా అదే సమయంలో పక్కింటి తాయారుతో కాళింది ఈ విధంగా అంటోంది, ' మీకు తెలీదు వదినగారూ. నాకు ఆయనతో దెబ్బలాడడం ఏం సరదానా? ఆయనకున్నంత అహంకారం ఈ ప్రపంచంలో ఏ మగాడికీ వుండదు. ఎప్పుడన్నా కూరలో కాస్త ఉప్పెక్కువ అయిందనుకోండి, అన్నం కంచం విసిరి కొడతాడు. రోజూ అద్భుతంగా వండి వార్చడం ఏ ఆడదాని వల్లనైనా అవుతుందాండి? ఒక్కొక్కసారి కూర గాని పచ్చడి గాని సరిగ్గా కుదరకపోవచ్చు. ఇంక ఆరోజు ఆ మగమహారాజు ఇల్లు పీకి పందిరేసేస్తాడు. భర్తగా కూడా ఆయన ఎప్పుడూ నా అవసరాలు కనిపెట్టడండి. నాకు చీరలు వున్నాయో, లేకపోతే కొనాలో ఆయనకి తెలీదు. సబ్బు అయిపోయిందని చెబుతే ఇంకో వారంరోజుల తర్వాత సబ్బు తీసుకు వస్తే

గొప్పమాట. అంతవరకూ కొబ్బరిపీచుతో ఒళ్ళు తోముకోవాల్సిందే. ఇలాంటివి ఇంకా చాలా వున్నాయిలెండి. ఎన్నని చెప్పను? కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. ఈ జీవితం ఇంక ఇల్లా గడిచిపోవల్సిందే. ఉంటాను వదినగారూ.'

******************************

అమ్మలూ! అయ్యలూ! అదీ సంగతి. రెండు కాపురాల్లోకీ మనం తొంగి చూసాం కదా? ఎలా బతికితే బాగుంటుందీ, ఎలా నడుచుకుంటే జీవితాలు సుఖమయమౌతాయీ అన్నది ఎవరికి వాళ్ళం ఆలోచించుకుంటేనే బాగుంటుందేమో కదూ?

❖❖❖❖❖

## పండిన అరటికాయ పచ్చడి


శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి

ఒక్కోసారి వెంటనే వండడం కుదరక అరటికాయలు పండిపోతుంటాయి. అలాంటప్పుడు ఈవిధంగా చెయ్యండి.

బాగా పండిన అరటికాయ ఒలిచి మెత్తగా నలపాలి. చింతపండు పులుసులో ఎండుమిర్చి, శనగపప్పు, మినప్పప్పు, ఆవాలు, జీలకఱ్ఱ, కరివేపాకు, ఇంగువ పోపు వేసి, అరటిపండు గుజ్జు అందులో వేసి, ఉప్పు వేసి బాగా కలపాలి. కూరవడియాలు కూడా వేయించి అందులో కలపాలి. ఉట్టినే తిన్నా బాగుంటుంది. అన్నంలో కలుపుకు తిన్నా బాగుంటుంది. మరెందుకాలస్యం? చేసిచూడండి.



❖❖❖❖❖


SMG Stone
SMG Stone pty ltd.
Web: http://www.smgstone.com.au
Phone : +61 2 9708 5566
Mobile : +61 418 696 672
Email: info@smgstone.com.au
STONE WITH LIFE
FOR STYLE AND ELEGANCE
FOR INDOORS AND OUTDOORS
Welcome to SMG Stone Pty Ltd . SMG Stone, based in Sydney, is committed to bring the nature to your homes from around the world. Established in 1992, SMG gained expertise in selecting, procuring and supplying natural stone from around the world. SMG has a huge selection of surfacing options for paving, building facades, lobbies, vanities, staircases and landscaping features. We are direct importers and wholesale distributors of quality natural stones such as granite, marble, slate, sandstones, cobble and the engineered stones in slab form for use in the manufacture of kitchen and vanity bench tops as well as other building uses.
Based in Sydney Australia with warehouses in Sydney and Melbourne, we are one of the reputed suppliers of an exclusive range of world class marble stone, granite and other natural stones. We import natural stone from around the world.
At SMG Stone Pty Ltd (SMG) we have the finest and largest product range. Our Sydney warehouse contain over 50,000sqm of natural stone. We have streamlined the supply chain for your convenience. We aim to achieve 100% client satisfaction by delivering a beautiful product with the highest quality and most importantly, with the right price. As project suppliers, we are able to procure natural stone according to your own specifications.
Specialized in the supply of natural stone products for hospitality, multi-family residential dwellings and institutional projects.
BRING NATURE TO HOMES
Designed by: DSLRCREW

# తెలుగు బడి

**Telugu Badi**

## తెలుగు బడికి ఆహ్వానం

### Welcome to Telugu Language School.

| We provide: | |
|---|---|
| ➢ Caring teachers<br>➢ Personal attention | ➢ Attractive learning activities<br>➢ Outcomes based teaching |

**A great opportunity for your child to learn Telugu.**

**Enrol in your nearest school today for 2019 starting on Sun, 3-Feb-2019.**

| | | |
|---|---|---|
| **Our Schools:** | Strathfield South PS | Eastwood PS |
| | Hambledon PS (Quakers Hill) | Hornsby South PS |
| | Darcy Rd PS (Wentworthville) | Holsworthy PS |


**When:** Every Sunday from 10 am to 12 noon (during school terms)

For details,
Visit: www.sydneytelugu.org
Call: 0402 169 963
Email: school@sydneytelugu.org




తెలుగు అసోసియేషన్ సిడ్నీ






# Kameswari



| Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are end times and Varjyam is start and end times in Australian Eastern Standard Time. | **JUNE 2019**<br>శ్రీ వికారి సంవత్సర<br>వైశాఖ బ త్రయోదశి to జ్యేష్ఠ బ ద్వాదశి | Su – Suddha Ba – Bahula/Krishna<br>Va – Varjyam R – Raahu Kaalam<br>Full – Thidhi or Nakshtra spread over midnight to midnight (24 hrs).<br>Times applicable in NSW ACT VIC. |
|---|---|---|

| | | | | | |
|---|---|---|---|---|---|
| **SUN**<br>R - 16:30 to 18:30 | **30**<br>బ ద్వాదశి 10:35<br>కృత్తిక 14:29<br>వ 2:28 to 4:04 | **2**<br>బ చతుర్దశి 21:08<br>భరణి 5:15<br>వ 17:12 to 18:47 | **9**<br>శు షష్ఠి 7:22<br>మఖ 20:19<br>వ 9:03 to 10:33 | **16**<br>శు చతుర్దశి 18:27<br>అనూరాధ 14:34<br>వ 20:18 to 21:56 | **23**<br>బ పంచమి 1:51<br>ధనిష్ఠ 1:37<br>వ 9:41 to 11:29 |
| **MON**<br>R - 7:30 to 9:30 | **పండుగలు/శలవలు**<br>1– శని త్రయోదశి<br>10– Queens Birthday | **3 ●**<br>బ అమావాస్య<br>20:02 కృత్తిక 5:09<br>వ 20:49 to 22:23 | **10**<br>శు సప్తమి 4:59<br>పుబ్బ 18:50<br>వ 3:49 to 5:19 | **17 ●**<br>శు పూర్ణిమ 18:23<br>జ్యేష్ఠ 15:07<br>వర్జ్యం లేదు | **24**<br>బ షష్ఠి 4:17<br>శతభిషం 4:32<br>వ 11:43 to 13:31 |
| **TUE**<br>R - 15:00 to 16:30 | **School Holidays**<br>VIC 29 Jun to 14 Jul | **4 జ్యేష్ఠం**<br>శు పాడ్యమి 18:24<br>రోహిణి 4:39<br>వ 10:01 to 11:33 | **11**<br>శు అష్టమి 2:47<br>ఉత్తర 17:28<br>వ 1:37 to 3:08 | **18**<br>బ పాడ్యమి 18:57<br>మూల 16:20<br>వ 14:39 to 16:20 | **25**<br>బ సప్తమి 6:37<br>పూర్వాభద్ర 7:30<br>వ 18:07 to 19:53 |
| **WED**<br>R - 12:00 to 13:30 | | **5**<br>శు విదియ 16:28<br>మృగశిర 3:39<br>వ 11:35 to 13:06 | **12**<br>శు నవమి 0:44<br>శు దశమి 22:51<br>హస్త 16:23<br>వ 1:30 to 3:01 | **19**<br>బ విదియ 20:02<br>పూర్వాషాఢ 17:58<br>వ 2:35 to 4:18 | **26**<br>బ అష్టమి 8:33<br>ఉత్తరాభద్ర 10:03<br>వ 23:05 to 0:49 |
| **THU**<br>R - 13:30 to 15:00 | **Sydney**<br>Sun Rise Set<br>1 6:52 16:53<br>8 6:56 16:52<br>15 6:59 16:52<br>22 7:01 16:53<br>29 7::01 16:55 | **6**<br>శు తదియ 14:18<br>ఆరుద్ర 2:21<br>వ 13:40 to 15:10 | **13**<br>శు ఏకాదశి 21:17<br>చిత్ర 15:25<br>వ 0:04 to 1:36<br>వ 20:52 to 22:25 | **20**<br>బ తదియ 21:36<br>ఉత్తరాషాఢ 20:07<br>వ 2:41 to 4:26 | **27**<br>బ నవమి 10:03<br>రేవతి 12:07<br>వర్జ్యం లేదు |
| **FRI**<br>R - 10:30 to 12:00 | **Melbourne**<br>Sun Rise Set<br>1 7:27 17:08<br>8 7:31 17:06<br>15 7:34 17:06<br>22 7:36 17:07<br>29 7:37 17:09 | **· 7**<br>శు చవితి 12:01<br>పునర్వసు 0:58<br>పుష్యమి 23:23<br>వ 8:27 to 9:56 | **14**<br>శు ద్వాదశి 19:54<br>స్వాతి 14:43<br>వ 20:16 to 21:51 | **21**<br>బ చవితి 23:31<br>శ్రవణం 22:47<br>వ 0:33 to 2:20 | **28**<br>బ దశమి 10:59<br>అశ్వని13:41<br>వ 9:26 to 11:08<br>వ 23:36 to 1:15 |
| **SAT**<br>R - 09:00 to 10:30 | **1 వైశాఖం**<br>బ త్రయోదశి 21:43<br>అశ్వని4:45<br>వ 0:33 to 2:14<br>వ 14:33 to 16:11 | **8**<br>శు పంచమి 9:41<br>ఆశ్లేష 21:46<br>వ 11:19 to 12:49 | **15**<br>శు త్రయోదశి 18:58<br>విశాఖ 14:29<br>వ 18:30 to 20:06 | **22**<br>బ పంచమి పూర్తి<br>ధనిష్ఠ పూర్తి<br>వ 3:15 to 5:03 | **29**<br>బ ఏకాదశి 11:15<br>భరణి 14:27<br>వర్జ్యం లేదు |

Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)


ARA VAULTS
SAFE DEPOSIT BOXES
SECURE YOUR VALUABLES
BULLION
JEWELLERY
DOCUMENTS
DATA
CURRENCY
WESTERN SYDNEY'S
MOST SECURE SAFE DEPOSIT BOXES
OWNED & OPERATED BY INDUSTRY EXPERTS
Our private, state-of-the-art vault is equipped with multiple layers of advanced electronic security, providing our members with both world-class security and peace of mind. Visit ARA Vaults today to learn how we can provide the most secure storage for your valuables.
PH: 02 8326 7907
aravaults.com.au


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE
Initial
Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au

WESTMEAD DOCTORS



## GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

## ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

## SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

## ONSITE PATHOLOGY

**Shop 6, Coles Complex**
**29-33 Darcy Road**
**WESTMEAD**

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

# BRAND NEW MELBOURNE CBD & SOUTHBANK APARTMENTS

**1, 2 & 3 beds from $489,000* (Off-the-plan)**




Walk to Melbourne city centre, Arts Precinct, shopping, cafes, restaurants, parks, transport & more.

Easy Access to RMIT & Melbourne University.

Exclusive resident facilities: Indoor pool, gym, terrace courtyard, BBQ, concierge & more.

✔ **Low Owners Corporation Fees (Strata Fees)**

BUY DIRECT *from* AUSTRALIAN OWNED DEVELOPER

**INSPECT IN SYDNEY OFFICE BY APPOINTMENT:**

**299 Elizabeth Street, Sydney**

**1800 44 55 20**

Multilingual staff available, many Indian languages spoken

**centralequity.com.au**

CENTRAL EQUITY 30TH YEAR CELEBRATION

AWARD WINNING MELBOURNE DEVELOPER

*OVER 75 PROJECTS DELIVERED AS PROMISED*

**Price as at 28/6/2018 until sold.*